

వరద పెరిగే చాన్స్

సోమశిల డ్యాంకు 14,946 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 14,946 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 73.689 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500 ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.పె న్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురుస్తున్నందున శనివారానికి వరద పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

● కండలేరులో 59.990 టీఎంసీలు

రాపూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 59.990 టీఎంసీల నీరుందని డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. సోమశిల నుంచి 3790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 2700 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని పేర్కొన్నారు.

కాల్చితే ఆనందం.. పేలితే ప్రమాదం!

దీపావళి కారాదు విషాదం

● నిర్లక్ష్యంగా బాణసంచా కాల్చవద్దు ● అప్రమత్తంగా లేకుంటే అనర్థమే

● అస్తమా, సీవోపీడీ రోగులు దూరంగా ఉండాలి ● కళ్లు, చర్మానికి పొంచి ఉన్న ప్రమాదం

దీపావళి అంటేనే బాణసంచా వేడుకలు. వాటిని కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పలు ప్రమాదాలకుతోడు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. దీపావళి వచ్చిందంటే పిల్లలు, పెద్దల్లో హడావుడి కనిపిస్తుంది. ఈ పండుగను కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. దీపావళి రోజున పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి ఇళ్ల ముందు దీపాలతో అలంకరించి బాణసంచా పేల్చుతారు. బాణసంచా కాల్చే సమయంలో పిల్లలు కానీ, పెద్దలు కానీ ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, మొరటుగా వ్యవహరించినా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఈనెల 20న దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాలుస్తుంటారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు పొంచి ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



నెల్లూరు (వైద్యం) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం తయారు చేస్తున్న బాణసంచాలో రసాయనాలు ఎక్కువగా ఉంటున్నాయి. వీటివల్ల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. బాణసంచాలో పొటాషియం నైట్రేట్, పొటాషియం క్లోరైట్స్, పోటాషియం పర్ క్లోరేట్స్, చార్‌కోల్, సల్ఫర్, మాంగనీస్, సోడియం ఆక్సలేట్స్, అల్యూమినియం, ఐరన్ డస్ట్ పౌడర్, స్ట్రాన్షియం నైట్రేట్, బేరియం నైట్రేట్ తదితర రసాయనాలు ఎక్కువగా ఉంటున్నాయి. రాకెట్లు, చిచ్చుబుడ్లు పేల్చినప్పుడు అందులోని పాలిక్లోరినేటెడ్ డై ఆక్సిన్స్, ఫూరాన్స్‌తోపాటు అనేక విషపదార్థాలు వాతావరణంలో కలుస్తాయి. వీటితోపాటు ఓజోన్ పొరను దెబ్బతీసే నైట్రోజన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ విడుదలవుతాయి.

అశ్రద్ధ చేస్తే వచ్చే రుగ్మతలు

- కళ్ల మంటలు, ఊపిరితిత్తుల్లో నెమ్ము
- గొంతు వాపు, జలుబు, తలనొప్పి, ఛాతీలో బరువు
- శ్వాసకోశ ఇబ్బందులు
- టపాసుల పొగ పీల్చాక పది, పదిహేను నిమిషాల్లో సల్ఫర్ డై ఆక్సైడ్ ప్రభావం చూపుతుంది.
- మానసిక, నరాల సమస్యలు
- రక్తసంబంధిత వ్యాధులు
- గుండె జబ్బులు, క్యాన్సర్ కారక వ్యాధులు
- నిద్రలేమి, వినికిడిశక్తి తగ్గిపోవడం, హైబీపీ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- టపాసులు కాల్చేటప్పుడు శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులు ధరించరాదు.
- శిల్క్ దుస్తులు ధరించరాదు. కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి.
- పేలుడు పదార్థాలు కాల్చేటప్పుడు పెద్దలు చిన్నారుల దగ్గరుండాలి.
- సంగ కాలిన టపాకాయల వద్దకు వెళ్లకూడదు.
- ఇరుకుగా ఉండే నివాసాలు, పూరిగుడిసెల మధ్యన టపాసులు పేల్చరాదు.
- టపాకాయలు కాల్చేటప్పుడు నీరు, ఇసుకను దగ్గరగా ఉంచుకోవాలి.
- తారాజువ్వలను నిలువుగా ఉంచి కాల్చాలి.
- చేతుల్లో టపాసులు కాల్చరాదు.
- చిచ్చుబుడ్డులు చేతుల్లో ఉంచి కాల్చరాదు.
- నివాసాల్లో టపాసులు నిల్వ ఉంచినప్పుడు పిల్లలకు అందకుండా ఉంచాలి.
- పెట్రోలు బంకులు దగ్గరగా ఉన్నచోట టపాసులు కాల్చరాదు.
- టపాసులకు సాంబ్రాణి కడ్డీలతో అంటించడం ఎంతో మేలు.
- టపాసులు కాల్చేటప్పుడు మూతికి గుడ్డ కట్టుకోవాలి.

కళ్లపై తీవ్ర ప్రభావం



టపాకాయల ప్రభావం కంటిపై తీవ్రంగా ఉంటుంది. టపాసుల్లో పొటాషియం నైట్రేట్, పొటాషియం క్లోరైట్స్, పోటాషియం పర్ క్లోరేట్స్, చార్‌కోల్, సల్ఫర్, మాంగనీస్, సోడియం ఆక్సలేట్స్, అల్యూమినియం, ఐరన్ డస్ట్ పౌడర్, స్ట్రాన్షియం నైట్రేట్, బేరియం నైట్రేట్, మొదలైన వెలుగులు విరజిమ్మే రసాయనాలు ఎక్కువగా ఉంటాయి. వీటిద్వారా వెదజల్లే రసాయనాలు కంటిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే కంటిపై పొర దెబ్బతినే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ శార్వాణి, ప్రభుత్వ కంటి వైద్యురాలు

చర్మంపై ప్రభావం ఎక్కువే



టపాకాయలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే చర్మం కాలిపోయే అవకాశం ఉంటుంది. ఒక్కోసారి చిచ్చుబుడ్లు పేలిపోయే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఒంటిపై పడి చర్మం కాలే అవకాశం ఉంది. బాణసంచా పేల్చేటప్పుడు అజాగ్రతగా ఉంటే చర్మం కాలి బొబ్బలెక్కే అవకాశం కూడా లేకపోలేదు. చిన్నగాయమే కదా అని నిర్లక్ష్యం చేస్తే ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయి. దీపావళి సమయంలో అస్తమా, సీవోపీడీ రోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ కృష్ణమూర్తి, జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్

దుకాణాలు 187.. దరఖాస్తులు 125 !

● నగరంలో ఆరు ప్రాంతాల్లో బాణసంచా అంగళ్లు

● వీఆర్సీ మైదానంలో ఏర్పాటుకు పోటీ

● లక్కీడిప్ ద్వారా షాపుల కేటాయింపు



బాణసంచా విక్రయ దుకాణాలకు సంబంధించి లక్కీడిప్ తీస్తున్న వ్యాపారి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో బాణసంచా దుకాణాల కేటాయింపునకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో లక్కీడిప్ నిర్వహించారు. ఆర్డీవో అనూష సెలవుపై వెళ్లడంతో కార్యలయ ఏవో నిర్మలానందబాబ,నవాబుపేట సీఐ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్కీడిప్ నిర్వహించారు. నగరంలో మొత్తం ఆరు ప్రాంతాల్లో షాపులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. వాటిలో వీఆర్‌సీలో 41 షాపులు, వైఎంసీ మైదానంలో 36, ఆర్‌ఎస్‌ఆర్ స్కూలు మైదానంలో 27, చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని ఖాళీ మైదానంలో 53, బీవీఎస్ స్కూల్ మైదానంలో 5, గోషామహల్ ప్రాంతంలో 25 షాపులను కలిసి మొత్తం 187 దుకాణాలను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే దరఖాస్తులు 125 మాత్రమే వచ్చాయి. ఇందులో ఎక్కువ మంది వ్యాపారులు వీఆర్‌సీ మైదానంలో దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకొన్నారు. జీఎస్టీ చెల్లించిన వ్యాపారులకు మాత్రమే దుకాణాలకు అనుమతి ఉంటుందని ఏవో నిర్మలానందబాబ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ డీటీ నాజర్, ఆర్డీవో కార్యలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దిద్దుబాటుకు అవకాశం ఎప్పుడో..!

● స్మార్ట్ రైస్ కార్డుల్లో కుప్పలు తెప్పలుగా తప్పులు

● సచివాలయాల్లో జవాబు చెప్పని సిబ్బంది

● తలలు పట్టుకుంటున్న కార్డుదారులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాల నియంత్రణ, పారదర్శకత కోసం తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డులు తప్పులు తడకలుగా ఉన్నాయి. వీటిని సరిచేసుకునే వెసులుబాటు లేకపోవటంతో కార్డుదారులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. సచివాలయాల్లో తప్పులు దిద్దుకునే ఏర్పాటు చేశామని అధికారులు ప్రకటించారు. అయితే సచివాలయ సిబ్బంది తప్పుల సవరణకు సంబంధించి తమకు ఎలాంటి ఆప్షన్ ఇవ్వలేదని, ఆప్షన్ వస్తే తెలియచేస్తామని చెబుతున్నారు. దీంతో స్మార్ట్ రైస్ కార్డుల్లో తప్పులు ఎప్పటికి సరిదిద్దుతారో..? అసలు దిద్దతారో... లేదో.. అనే ఆందోళనలో కార్డుదారులు ఉన్నారు. జిల్లాలో పంపిణీ చేసిన స్మార్ట్ రైస్ కార్డుల్లో కొన్నింటిలో కుటుంబసభ్యుల పేర్లు మారిపోవడం, అసలు పేర్లే లేకపోవడం, చిరునామా తప్పుగా ముద్రిత మవడం, ఊర్లపేర్లు తప్పులుగా పడటం చోటుచేసుకున్నాయి. దీంతో కార్డుల్లో తప్పులు సరిచేసుకునేందుకు కార్డుదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

● 7.10లక్షల కార్డులు

జిల్లాకు 7,10,998 స్మార్ట్ కార్డులు వచ్చాయి. రేషన్ షాపుల వారీగా, సంబంధిత సచివాలయాల వారీగా ఈ కార్డులను చేర్చారు. జిల్లాలో 1513 రేషన్ షాపుల ద్వారా కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. తొలుత సచివాలయాల ద్వారా, తరువాత రేషన్ డీలర్ల ద్వారా వీటిని పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఇంతవరకు పూర్తిగా పంపిణీ కాలేదు.ప్రతీ సచివాలయంలో 100 నుంచి 150 కార్డుల వరకు పంపిణీ కాలేదని సమాచారం



కార్యదర్శులు పనిచేస్తేనే పంచాయతీలకు ఆదాయం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు కష్టపడి పని చేస్తేనే పంచాయతీలకు ఆదాయం వస్తుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నెల్లూరులో శుక్రవారం డీపీవో ఆధ్వర్యంలో జిల్లాస్థాయి డిప్యూటీ ఎంపీడీవో, డీఎల్‌పీవో, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్‌పై ప్రధానంగా అధికారులకు ఆయన సలహాలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, లేఅవుట్‌దారులకు అవగాహన కల్పించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రతి లేఅవుట్‌ను చట్టబద్ధం చేసుకునేందుకు ఎల్ఆర్ఎస్ ఉపయోగపడుతుందన్నారు. ప్రజల సౌలభ్యం కోసం సీఎం చంద్రబాబు ఈ స్కీమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. మంత్రి నారాయణ సహకారంతో నుడా అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ తీసుకొచ్చేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. చాలా మంది ఈ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. నుడా పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవడం లేదని పేర్కొన్నారు. అలాంటి లేఅవుట్‌దారులను గుర్తించి ఈస్కీమ్‌ను ఉపయోగించుకునేలా చూడాలని కోరారు. ఈవిషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నుడా సెక్రటరీ అల్లంపాటి పెంచలరెడ్డి, నుడా అధికారులు హిమబిందు, కాలేషా, చంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల జీవో విడుదల చేయాలి

● లేకుంటే 23 నుంచి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



నెల్లూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల జీవో విడుదల చేయాలని, లేని పక్షంలో ఈనెల 23 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. శుక్రవారం నెల్లూరులో నిర్వహించిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులపై సీఎం అనుమతులు ఇచ్చినా, ప్రభుత్వంలో కొంతమంది ఉన్నతాధికారుల వైఖరితో జాప్యం జరుగుతుందని తెలిపారు. ఇందుకు నిరసనగా ఈనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా 123 డిపోల్లోనూ, నాలుగు వర్క్‌షాపుల వద్ద ఎర్రబ్యాడ్జీలతో ధర్నాలు చేపడతామని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం అనంతరం గత ఆరేళ్లుగా వివిధ విభాగాల్లో వేలాదిమంది ఉద్యోగుల పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికే రెండు వేలమంది ఉద్యోగులు పదోన్నతులు లేకుండానే ఉద్యోగవిరమణ చేసి ఆర్థికంగా నష్టపోయారని ఆయన వివరించారు. ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు కూడా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. స్త్రీశక్తి పథకం వల్ల ఉద్యోగులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగాలంటే వెంటనే మూడువేల బస్సులు కొనుగోలు చేయడంతోపాటు పదివేల ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీఈయూ జోనల్ కార్యదర్శి దాసరి బాబూశామ్యూల్, జిల్లా అధ్యక్షుడు వీ.యుగంధర్, కార్యదర్శి ఓవీ.ప్రసాద్, జోనల్ జాయింట్ సెక్రటరీ వీ.శ్రీనివాసులురెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, కార్యదర్శి బీ.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

కుర్చీ లేని హెచ్‌ఎం

● మనుబోలు మోడ్రన్ స్కూల్లో వసతుల కరువు

● అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



విద్యార్థులతోపాటు నేలపై కూర్చుని పాఠాలు చెబుతున్న ప్రధానోపాధ్యాయుడు

మనుబోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటో చూశారా...? పాఠశాల వరండాలో నేలపై కూర్చుని ప్రధానోపాధ్యాయుడు ఐదోతరగతి పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. ఆయన కూర్చునేందుకు కుర్చీలేదు. పిల్లలకూ బల్లలు లేవు. రికార్డులు పెట్టుకునేందుకు డెస్కులు లేవు. అంతెందుకు.. రాసి చూపించేందుకు బ్లాక్ బోర్డులు లేవు. అంతేకాదండయ్... ఐదో తరగతికి ప్రత్యేక తరగతి గదంటూ లేదు. ఈ వరండానే వారికి దిక్కు. ఇంతకీ ఇదెక్కడంటారా..? మండల కేంద్రమైన మనుబోలులోని మోడ్రన్ ప్రైమరీ స్కూలు.

● నాడు- నాడు పథకానికి దూరం

గత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో పాఠశాలలను బాగుచేశామని ఊదరగొట్టింది. గత ఐదేళ్లలో ఒక్క రూపాయికి ఈ పాఠశాలకు ఖర్చు చేయలేదు. నాడు-నేడు పథకానికి ఈ పాఠశాల నోచుకోలేదు. పాఠశాలకు గ్రీన్‌బోర్డులు ఇవ్వలేదు. టీవీ లేదు. ఫ్యాన్లు, లైట్లు ఇవేమీ లేవు. ఈ పాఠశాలలో 63మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఒక్క తరగతికి కూడా బెంచీలు లేవు. బాత్రూమ్‌లు సరిగా లేవు. కిటికీలు ఉన్నా తలుపులు లేవు. వర్షం వస్తే పాఠశాల తడిసిపోతుంది. కనీసం పిల్లలకు మంచినీరు అందించే ఆర్‌వో మిషన్ కూడా లేదు.ఇటీవల పాఠశాల ప్రహరీ గేట్లు దెబ్బతిన్నాయి.

● వసతులు చూడకనే...

ఈ పాఠశాలలో కనీస వసతులు ఉన్నాయా...? లేవా...? అని చూడకుండానే కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులు సమీపంలోని నాలుగు పాఠశాలలను ఇందులో కలిపారు. ఈ పాఠశాలను మోడ్రన్ ప్రైమరీ స్కూల్‌గా మార్చారు. ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలోనే పిల్లలను స్కూలుకు తీసుకువచ్చేందుకు ఉపాధ్యాయులు నానా తంటాలు పడ్డారు. పాఠశాలలో వసతులు సరిగా ఉంటేనే కదా...? తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపుతారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు, పాలకులు స్పందించి మోడ్రన్ ప్రైమరీ స్కూలులో వసతులు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ఇంతకుముందు ఇద్దరు టీచర్లు ఉండగా, తాజాగా మరో ముగ్గురిని ఇక్కడ నియమించారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి

కలెక్టర్ హిమాన్షు శుక్లా

వివరాలు 10లో..

కామాక్షితాయికి వైభవంగా పల్లకీ సేవలు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో శుక్రవారం రాత్రి కామాక్షితాయికి పలకీ సేవలు వైభవంగా జరిగాయి. అమ్మవారి ఉత్సవమూర్తిని పలకీలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం గంగా, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామికి ఆలయ పురోహితులు చేసిన నిత్య కళ్యాణోత్సవం భక్తులను అలరించింది. భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12455
వెండి కిలో ధర	రూ. 182000
వెండి ఒక గ్రాము	రూ. 191.00



బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి!

● రంగనాథ్ గౌడ్, ఎస్ఐ, కోవూరు

కోవూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయాలకు వ్యాపారులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు. లైసెన్స్ పొందిన దుకాణాదారులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. రెండు దుకాణాల మధ్య కనీసం రెండు అడుగుల దూరం ఉండాలన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

?. టపాసుల దుకాణాల ఏర్పాటు విధివిధానాలు ఏంటి

!. దీపావళికి అనుమతులున్న దుకాణాల్లోనే బాణాసంచా విక్రయించాలి. దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలిస్తాం. రెండు దుకాణాల మధ్య కనీసం రెండు అడుగుల దూరం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. మితి మీరి గ్రామాల్లో బాణాసంచా కాల్చితే చర్యలు తీసుకుంటాం.

?. దుకాణాల ఏర్పాటుపై చర్యలు తీసుకున్నారా

!. దుకాణాల ఏర్పాటుపై దుకాణాల యజమానులు, పోలీసు, రెవెన్యూ శాఖల సిబ్బందితో తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించాం. పద్ధతి ప్రకారం దుకాణాలను ఏర్పాటు చేసి బాణాసంచా విక్రయించే విధంగా చర్యలు తీసుకున్నాం. లైసెన్స్ లేకుండా బాణాసంచా విక్రయిస్తే నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తాం. విక్రయించే టపాసు లన్నింటికీ బిల్లులు తప్ప కుండా ఉండాలి.

?. తాత్కాలిక లైసెన్స్‌లు ఎక్కడ ఇస్తారు

!. తాత్కాలిక లైసెన్స్‌లు ఆర్డీఓ ఇస్తారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకోవాలి. అన్నీ సక్రమంగా ఉంటే దుకాణాలు నిర్వహించుకోవచ్చు.

?.ఇసుక అక్రమరవాణాపై చర్యలు ఏవీ

!. జమ్మిపాళెం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎక్సకవేటర్లను స్వాధీనం చేసుకున్నాం. ఇసుక, మట్టి, దువ్వ అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. వాహనాలను స్వాధీనం చేసుకుంటాం. స్థానిక అవసరాల కోసం ఇసుక తరలిస్తే అడ్డుకునే ప్రసక్తే లేదు. ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటే కేసులు నమోదు చేస్తాం.

వాళ్ల నిర్లక్ష్యం.. వీళ్లకు శాపం !

● అడకత్తెరలో 10 సచివాలయాలు, 2 గ్రామ పంచాయతీలు
● ఉద్యోగులకు అందని వేతనాలు
● పట్టించుకోని అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీలో సిబ్బంది భర్తీకోసం అధికారులు చేసిన నిర్లక్ష్యం, పాపం 10 సచివాలయాల ఉద్యోగులు, శ్రీపురంధరపురం, నాగాయగుంట 2 గ్రామ పంచాయతీలకు శాపమైంది. 2019లో బుచ్చి పట్టణంతోపాటు మండలంలో అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి మొత్తం 23 సచివాలయాలు ఏర్పాటయ్యాయి. 2021లో బుచ్చి నగర పంచాయతీగా ఏర్పడిన తరువాత 9 సచివాలయాలు పూర్తిగా నగర పంచాయతీలో విలీనం చేశారు. ఐతే నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాళెం గ్రామంలో మరో సచివాలయం వుంది. కట్టుబడిపాళెంతోపాటు బుచ్చి దళితవాడ, రామచంద్రాపురం గిరిజనకాలనీ ప్రాంతాలనూ, రూరల్ పరిధిలోని శ్రీపురంధరపురం, నాగాయగుంట పంచాయతీలు వాటి అనుబంధ గ్రామాలనూ ఈ సచివాలయం పరిధిలోకి చేర్చారు. అప్పనుంచి గత 2 నెలల క్రితం వరకు రూరల్ పరిధిలోని ఆ 2 గ్రామ పంచాయతీలపాలన ఈ సచివాలయ అధికారులు, సిబ్బందే చూసేవారు. మిగతా 13 సచివాలయాలు రూరల్ పరిధిలోని గ్రామ పంచాయతీలలో ఉన్నాయి. ఐతే అప్పటి వరకు నగర పంచాయతీలోని 9 సచివాలయాలతోపాటు కట్టుబడిపాళెం సచివాలయ ఉద్యోగులకూ కట్టుబడిపాళెం, ఇస్కపాళెం సెక్రటరీలే డీడీఓలుగా ఉండి ప్రతినెలా జీతాలు విడుదల చేసేవారు. బుచ్చి నగర పంచాయతీ, మున్సిపాలిటీ ఏర్పాటు నేపథ్యంలో సిబ్బంది భర్తీతోపాటు శాశ్వత సిబ్బందికోసం మున్సిపాలిటీ అధికారులు కట్టుబడిపాళెం సచివాలయాన్ని నగర పంచాయతీలో విలీనం చేసుకుని, నాన్ విల్లింగ్ పేరుతో ఆ సచివాలయ సెక్రటరీతోపాటు ఇస్కపాళెం సెక్రటరీ డీడీఓల పవర్‌ను రద్దు చేయించారు. కట్టుబడిపాళెం సచివాలయంతో కలిపి బుచ్చి మున్సిపాలిటీ పరిధిలో 10 సచివాలయాలయ్యాయి. దీంతో ఇటీవల వరకు కట్టుబడిపాళెం సచివాలయం పరిధిలో వున్న పురంధరపురం, నాగాయగుంట గ్రామ పంచాయతీలలో పాలన చేసే అధికారులు, సిబ్బంది తోపాటు సచివాలయం కూడాలేక పాలన ప్రశ్నార్థకమైంది. ప్రజల సమస్యలను పట్టించుకునే అధికారులూ కరువయ్యారు. కట్టుబడిపాళెం గ్రామంలోని ఆ రెండు ప్రాంతాలను బుచ్చి పెదూరు సచివాలయంలో విలీనం చేసి, కట్టుబడిపాళెం సచివాలయాన్ని ఆ సిబ్బందిని పురంధరపురం, నాగాయగుంట పంచాయతీలకు వదిలేసి వుంటే ఈ సమస్య ఉండేది కాదని పలువురు స్థానిక నాయకులు చెబుతున్నారు. ఈ విషయాన్ని కమిషనర్‌కు చెప్పినా పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు కట్టుబడి పాళెంతోపాటు అన్ని సచివాలయాలను మున్సిపాలిటీలోకి విలీనం చేసుకున్నట్లు తెలిపారు.



బుచ్చి మున్సిపాలిటీలో విలీనమైన కట్టుబడిపాళెం సచివాలయం

ఆగిన 10 సచివాలయ ఉద్యోగుల జీతాలు

నగర పంచాయతీలో 9 సచివాలయాలు విలీనమైనప్పటినుంచి ఆయా సచివాలయాలతో పాటు కట్టుబడిపాళెం సచివాలయ సిబ్బంది కలిపి మొత్తం 70నుంచి 90 మంది ఉద్యోగులకు కట్టుబడిపాళెం సెక్రటరీ శ్వేత, రూరల్ పరిధిలోని ఇస్కపాళెం సెక్రటరీ విజయకృష్ణ డీడీఓలుగా ప్రతీ నెలా వేతనాల ప్రక్రియ పూర్తి చేసేవారు. అయితే కట్టుబడిపాళెం సచివాలయం విలీనంతో ఆ ఇద్దరి సెక్రటరీలకు ఉన్న డీడీఓల పవర్స్ లాగిన్ నుంచి తొలగించడంతో రద్దయ్యాయి. దీంతో పొజిషన్ ఐడీ, క్యాడర్ స్ట్రెంత్ లేక జీత, భత్యాలు డ్రా చేసుకునే అధికారం కోల్పోయారు. ఈ పరిస్థితితో మొత్తం 10 సచివాలయాలలో సుమారు 70 నుంచి 90మంది ఉద్యోగులకు గత నెల నుంచి జీతాలు ఆగిపోయాయి. దీంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. డీడీఓ పవర్స్ రద్దు చేయించిన అధికారులు ఎవరో ఒకరికి పవర్స్ కల్పించాలి. అలా చేయకపోవడంతో వేతనాలు సకాలంలో అందక ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారు. దీంతో ఇప్పటి వరకు డీడీఓలుగా వున్న కట్టుబడిపాళెం, ఇస్కపాళెం సచివాలయాల సెక్రటరీల బదిలీ కోసం నెల క్రితమే అప్పటి ఎంపీడీఓ డీపీఓకు సిఫార్సు చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేస్తేనే వారికి పోస్టింగ్ ఇచ్చే పరిస్థితి నెలకొంది. ఒకవేళ బదిలీపై వెళ్ళినా ఆగిన జీతాలు ఎప్పటికి అందుతాయో తెలియని పరిస్థితి ఉందని ఉద్యోగులు వాపోతున్నారు.

కొత్త సచివాలయం ఏర్పాటు చేయాలి



బుచ్చి మున్సిపాలిటీలోకి కట్టుబడిపాళెం సచివాలయం విలీనం కావడంతో శ్రీపురంధరపురం, నాగాయగుంట గ్రామ పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారింది. సచివాలయంలోని కొంతమంది సిబ్బంది ఇన్‌చార్జ్‌లుగా ఉంటున్నారే తప్ప ఆ రెండు గ్రామ పంచాయతీల సమస్యలు పట్టించుకునేవారు కరువయ్యారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని శ్రీపురంధరపురం, నాగాయగుంట పంచా యతీలకు కొత్త సచివాలయం ఏర్పాటు చేసేలా చొరవ చూపాలి.

- సోము నిర్మల, సర్పంచి, శ్రీపురంధరపురం



పిడుగుపడి యువకుడి మృతి



మృతి చెందిన మస్తానయ్య

వెంకటాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదగాలి పంచాయతీ శ్రీకాంత్ కా లనీలో శుక్రవారం తెల్లవారు జామున పిడుగుపాటుకు ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాంత్ కాలనీకి చెందిన అమ్మాటి మస్తానయ్య (26) ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తుండగా భారీ వర్షం మొద లైంది. పిడుగు పడడంతో మస్తానయ్య మృతి చెందగా ఇంట్లో మొబైల్, విద్యుత్ స్విచ్‌బోర్డులు పేలిపోయాయి. పక్కనే నిద్రి స్తున్న రెండేళ్ల కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. సీఐ సుబ్బా రావు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణీభవాని నాయుడు, నాయకులు పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, పొట్లూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఇంటర్ విద్యార్థి...



మృతి చెందిన దత్తాత్రేయ

కావలి రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య మృతి చెందడంతో పుట్టెడు దుఃఖం నుండి ఇంకా తేరుకోక ముందే విద్యుదాఘాతంతో కుమారుడు బోయన దత్తాత్రేయ (17) మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం కావలి మండలం ఆర్వీపాలెంలో జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బోయిన మాల్యాద్రి, అమీన దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. చిన్న కుమారుడు దత్తాత్రేయ పట్టణంలోని సాయి కోఆపరేటివ్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటి వద్ద ఉన్న మోటారుకు నీళ్ల రాకపోవటంతో మోటారును పరిశీలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడి కక్కడే మృతి చెందాడు. 15 రోజుల క్రితం అనారోగ్యంతో భార్య అమీన మృతి చెందింది. చిన్నకుమారుడు దత్తాత్రేయ మృతి చెందటంతో మాల్యాద్రి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాజీబాబు తెలిపారు.

శ్లాబ్ కూలి వ్యక్తి....



కూలిన శ్లాబు

నెల్లూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్లాబ్ కూలి చిరు వ్యాపారి మృతి చెందిన ఘటన నెల్లూరులో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని రంగనాయకుల పేట సోమిశెట్టి కల్యాణ మండపం సమీపంలో ఎస్ వెంకటేశ్వర్లుకు చెందిన గృహ సముదాయంలో బొమ్మా దయాకర్(47), లక్ష్మీ దంపతులు అద్దెకు నివసిస్తున్నారు. దయాకర్ స్థానికంగా టీ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోడ్డు మార్జిన్‌లో దుకాణం తొలగించడంతో ప్రస్తుతం తోపుడు బండిపై టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగానే శుక్రవారం కూడా తెల్లవారుజామునే టీ అమ్ముకునేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. కురుస్తున్న వర్షాల కారణంగా రెండో అంతస్తు సైడ్ శ్లాబ్ విరిగి దయాకర్‌పై పడింది. దీంతో వచ్చిన పెద్ద శబ్దంతో భార్య, చుట్టుపక్కల వారు బయటకు పరుగులు తీయగా అప్పటికే దయాకర్ అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించగా ఆ వాహనం సిబ్బంది వచ్చి పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో భార్య లక్ష్మీ ఫిర్యాదుతో సంతపేట సీఐ వైవీ సోమయ్య, ఎస్ఐ సుల్తాన్‌బాషా అక్కడికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్టర్‌పై మద్యం సీసాతో దాడి

నెల్లూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జేసీబీ కాంట్రాక్టర్ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి మద్యం బాటిల్‌తో దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని వేదాయపాళెం పరిధిలో ఉన్న త్యాగరాజనగర్ మూడో వీధిలో జేసీబీ కాంట్రాక్టర్ వీ కిషోర్‌కుమార్, అరుణ దంపతులు నివసిస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వారి ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ కొట్టడంతో కిషోర్ తలుపులు తీశారు. వెంటనే ముగ్గురు దుండగులు ఇంటిలోకి ప్రవేశించి ఖాళీ మద్యం సీసాలతో కిషోర్‌కుమార్‌పై దాడి చేశారు. దీంతో బాధితుడు అపస్మార స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆయన భార్య గట్టిగా కేకలు వేయడంతో నిందితులు ముగ్గురూ పరారయ్యారు. చుట్టుపక్కల వారి సహాయంతో కిషోర్‌ను ఆసుపత్రికి తరలించారు. వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల సమ్మెకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న వైద్య సిబ్బంది

మనుబోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత నెల 25 నుంచి డిమాండ్ల సాధన కోసం జిల్లాలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో సమ్మెలో పాల్గొంటున్న వైద్యులకు సిబ్బంది సంఘీభావం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో మనుబోలు పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి అరగంటపాటు నిరసన తెలియజేశారు.

సంపన్నులు సమాజసేవలో భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతి

ఇందుకూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంపన్నులు సమాజసేవలో భాగస్వాములు కావాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. ఇందుకూరుపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రెడ్డి ల్యాబ్స్ అందజేసిన ఫిజియోథెరపీ, డెంటల్ పీడియాట్రిక్ తదితర విభాగాలకు సంబంధించి రూ.40 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను ఆమె ప్రారంభించారు. అత్యాధునిక వైద్య పరికరాలు అందజేసిన రెడ్డి ల్యాబ్స్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి రెడ్డి ల్యాబ్స్ సంస్థ ప్రతినిధులు సహకరించాలని కోరారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో వీపీఆర్ నేత్ర అనే బృహత్తర కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీ వేమిరెడ్డి సహకారంతో రూ.3.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో త్వరలోనే ఆధునీకరణ పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇందుకూరుపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని అత్యాధునిక వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు ఏకొల్లు పవన్‌కుమార్‌రెడ్డి, చెంచు కిషోర్‌యాదవ్, మునగాల రంగారావు, దాసరి విజయ్, అవ్వారు ఏడుకొండలు, లేబూరు వెంకటేశ్వర్లు, మండల బీజేపీ అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుని దయతోనే ప్రజలకు చేసే భాగ్యం

విడవలూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకామాక్షీదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దయతో ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శుక్రవారం రామతీర్థం గ్రామంలో శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోవూరు డివిజన్ ఆలయ ఉన్నతాధికారి రాజు సమక్షంలో ఎమ్మెల్యే ఆలయ చైర్మన్‌గా అత్తిరాల సురేష్, సభ్యులు తాతా రమేష్, వనజ, భాగ్యరేఖ, కల్పన, పద్మ, మంగమ్మ, శ్రీనివాసులు, శర్వన్ కుమార్, పుల్లయ్య సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్‌శర్మలు ప్రమాణ స్వీకారం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి మండలాధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, ఆవుల వాసు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పొన్నాడి చంద్రశేఖర్, చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

వెంకటాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడిపర్తి శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ధర్మకర్తల కమిటీ ప్రమాణస్వీకారం వైభవంగా జరిగింది. కమిటీ చైర్మన్‌గా ఈపూరు శరత్‌బాబు, సభ్యులు దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు, ఈఓ శ్రీధర్ నాయుడు సమక్షంలో నూతన కమిటీ చేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బీ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై కేసు నమోదు

విడవలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముదివర్తి సమీపంలోని పెన్నా తీరంలో అనుమతులు లేకుండా జరుపుతున్న మట్టి తవ్వకాలపై శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విచారణకు ఆదేశించారు. దీంతో తహసీల్దారు చంద్రశేఖర్, వీఆర్వో వెంకటేశ్వర్లు 4 ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ నరేష్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

సర్వేపల్లిలో వైసీపీ భూస్థాపితం:ఎమ్మెల్యే సోమిరెడ్డి



టీడీపీలో చేరిన నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అరాచకాలు, అవినీతి కారణంగా వైసీపీ పూర్తిగా భూస్థాపితమైందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరు నగరంలోని వేదాయపాళెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం 23 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మండలంలోని సర్వేపల్లి గ్రామానికి చెందిన సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, వైసీపీ నేతలు పొనకా రఘురామిరెడ్డి, జగదీష్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, ప్రసాద్, వెంకటే శ్వర్లు, కొండయ్య, మస్తాన్ మొదలైన నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే సోమిరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పాత, కొత్త నేతలందరూ సమిష్టిగా సర్వేపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సోమిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణా రెడ్డి, చవటపాళెం సొసైటీ అధ్యక్షుడు రావూరి రాధాకృష్ణమ నాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో బాలికల ప్రతిభ

పొదలకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పొదలకూరు డీఎస్ఆర్ బాలికలు ప్రతిభ కనబరిచారు. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు బీ శైలజ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో మాట్లాడుతూ 28 సంవత్సరాల తర్వాత మొదటిసారి బాక్సింగ్‌లో నెల్లూరు జిల్లాకు గోల్డ్ మెడల్ దక్కిందన్నారు. రూప, లీల, స్వప్నప్రియ, నిఖిత, పావని, జయశ్రీలు సిల్వర్, బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. వీరిని పాఠశాల దాతలు దేవరం రఘురామి రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు దేవిక తదితరులు అభినందించారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పరీక్షలు శనివారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం ప్రశ్న పత్రాలను నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ నుండి సిబ్బంది బుచ్చి పోలీస్‌స్టేషన్‌కు చేర్చారు. 10 రోజులపాటు డిగ్రీ పరీక్షలు జరగనున్నాయి. బుచ్చిలో 2 కేంద్రాలలో జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఏవీ చిరంజీవి తెలిపారు. శనివారం ఉదయం తృతీయ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు.

వ్యాసరచన పోటీలు

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా దామరమడుగు జడ్పీ హైస్కూల్‌లో ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసులు రెడ్డి, ఖాదర్‌షా, రసూల్, మదన్‌మోహన్, రమాదేవి, పద్మావతి, మల్లికార్జున, జిల్లా కార్యదర్శి రషీద్, మండల కార్యదర్శి మునీర్, ఉపాధ్యక్షుడు జానీబాషా, పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా టపాసుల వ్యాపారులు నిబంధనలు పాటించాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం బుచ్చి పోలీస్ స్టేషన్‌లో ఆయన ఎస్ఐ సంతోష్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. జొన్నవాడ రోడ్డు లోని లైలా ఫంక్షన్‌హాల్ ఎదురుగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

బోనస్‌లు చెల్లించాలి

ముత్తుకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు బోనస్‌లను వెంటనే చెల్లించాలని సీఐటీయూ కృష్ణపట్నం క్లస్టర్ అధ్యక్షుడు గోగుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ముత్తుకూరు శ్రామిక భవనంలో శుక్రవారం సమావేశం జరిగింది కార్యక్రమంలో సీఐటీయూ కృష్ణపట్నం క్లస్టర్ అధ్యక్షుడు అంకయ్య, భాస్కర్, సీఐటీయూ సభ్యులు శ్యాంప్రసాద్, కల్లూరు నాగరాజు, గంగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రాకేశ్‌ను అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ ఎనాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ పై షూ విసిరిన రాకేష్‌పై కేసు నమోదుచేసి, వెంటనే అరెస్టు చేయాలని ఎంపీఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బుచ్చిలో తహసీల్దారు కార్యాలయం ముందు నల్ల కండువాలతో నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జ్ దర్శిగుంట శ్రీనివాసులు, సునీల్, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాపూరు: సీజేఐపై దాడికి నిరసనగా రాపూరులో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ మండల నాయకుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాకేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఎమ్మార్వోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పచ్చిగళ్ళ ప్రేమ్ కుమార్, మాదిగ ఎంఎస్పీ మండల అధ్యక్షుడు రత్నయ్య, మాదిగ, ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బక్కా శివశంకర్, ప్రచార కార్యదర్శి నిప్పట్లపల్లి పెంచల ప్రసాద్, మాదిగ ఎంఎస్పీ వర్కింగ్ ప్రెసిడెంట్ చింతకుంట శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షుడు ఆదూరి దేవరాజ్ మాదిగ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో గర్భిణికి పురిటి నొప్పులు

● అంబులెన్స్‌లో ఆసుపత్రిలో చేర్పించిన టోల్ ప్లాజా, హైవే సిబ్బంది
● ఏరియా వైద్యశాలలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



ఆస్పత్రిలో ఆడశిశువుకు జన్మనిచ్చిన నాగలక్ష్మి

కావలి రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో నెల్లూరు ఆస్పత్రికి వెళుతుండగా పురుటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని మునునూరు టోల్ ప్లాజా సిబ్బంది మానవత్వంతో స్పందించి ఆదుకున్నారు. అంబులెన్సును పిలిపించి సకాలంలో ఆస్పత్రికి చేర్పించారు. గర్భిణి కుటుంబ సభ్యుల కథనం మేరకు... పట్టణంలోని సంకులవారితోటలో గోపి, నాగలక్ష్మి దంపతులు నివశిస్తున్నారు. రెండవ కాన్పు కోసం నెల్లూరులోని నారాయణ వైద్యశాలకు తల్లి పద్మ, భర్త గోపీతో కలసి గర్భిణి నాగలక్ష్మి కావలి నుండి ఆర్టీసీ బస్సులో నెల్లూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో మునునూరు టోల్ ప్లాజా వద్దకు వచ్చేసరికి నాగలక్ష్మికి పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలపగా, తోటి ప్రయాణీకులు ఆమెకు సపర్యలు చేస్తుండగా, విషయం తెలుసుకున్న టోల్ ప్లాజా మేనేజర్ గణేష్, సిబ్బంది, హైవే సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. హుటాహుటిన హైవే అంబులెన్స్‌లో ఆమెను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు ఉషాబాల, వెంకటలక్ష్మి, మాధవీలత సిబ్బంది 10 నిమిషాల వ్యవధిలోనే సాధారణ కాన్పు చేయగా, నాగలక్ష్మి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. టోల్ ప్లాజా, హైవే సిబ్బంది, ప్రయాణీకులు, వైద్యులకు నాగలక్ష్మి, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
కోడిగుడ్ల ధర (100): 560	

నేడు శని మహా ప్రదోషం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో శనివారం శని మహాప్రదోషకాల అభిషేకాలు జరుగుతాయని ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4.40 గంటలకు నందీశ్వరునికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, అనంతరం మూలస్థానేశ్వరస్వామికి అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. రాత్రి చిన్న వెండి నంది వాహనంపై శివపార్వతులకు ప్రాకారోత్సవం నిర్వహిస్తామని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

నేడు వేణుగోపాలస్వామి ఆలయంలో గ్రామసభ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేటలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం 11గంటలకు గ్రామసభ జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి ఈ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానికులు, ఆధ్యాత్మిక చింతనాపరులు, భక్తులు హాజరై వారి సలహాలు, సూచనలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాలకు త్వరలో త్రీఫేస్ విద్యుత్

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గ్రామాలకు అతి త్వరలో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం 24 గంటల పాటు అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. చంద్రన్న వెలుగు పేరుతో నిర్వహిస్తున్న విద్యుత్ అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ నెల 25 నాటికి పనులన్నీ పూర్తవుతాయని చెప్పారు.

క్లాప్ ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మాగుంట లేఅవుట్‌లో మోకాళ్ల, కీళ్ల నొప్పుల చికిత్సలకు సంబంధించి క్లాప్ ప్రత్యేక చికిత్సా కేంద్రం శుక్రవారం ప్రారంభమైంది. క్లాప్ మేనేజింగ్ డైరెక్టర్ స్రవంతి మాట్లాడుతూ చాలా మంది మోకాళ్లనొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారని, ఈ నొప్పులకు సంబంధించి తమ కేంద్రంలో ప్రత్యేక వైద్యుల సలహాలతో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. దీనికి సంబంధించి జర్మనీలో ప్రత్యేక శిక్షణ పొందామన్నారు. తక్కువ ఖర్చుతో చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

విద్యుత్ భవన్‌లో సీజీఎం



నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ పీ సురేంద్రనాయుడు శుక్రవారం నగరంలోని విద్యుత్ భవన్‌కు విచ్చేశారు. ఆయనకు విద్యుత్ ఎస్ఈ కే రాఘవేంద్రం పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఈఈలు సోమశేఖర్ రెడ్డి, శ్రీదర్, పరంధామయ్య, రమేష్ చౌదరి, భానునాయక్, బెనర్జీ, డీఈ ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడుకు సోమశిల జలాలు విడుదల చేయాలి

లింగసముద్రం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల ప్రాజెక్టు నీటిని విడుదల చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాంశు శుక్లాను ప్రాజెక్టు ఈఈ జి మునిర త్నం కోరారు. శుక్రవారం ఈఈ మునిరత్నం, డీఈఈలు ఎం వెంకటేశ్వర్లు, పి శేషయ్యలు నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ను కలిసి రాళ్లపాడు ప్రాజెక్టు వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. సోమశిల నుంచి నీటిని రాళ్లపాడు ప్రాజెక్టుకు విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కలెక్టర్ సానుకూలంగా స్పందించి సో మశిల ఎస్ఈ ఎంవి రమణారెడ్డితో ఫోన్‌లో నీటి విడుదల గురించి మాట్లాడారు. ఈనెల 22 తర్వాత నీటి విడుదలకు తీసుకుంటారని కలెక్టర్ తెలియజేసినట్లు ఈఈ మునిరత్నం తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు

కందుకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ము న్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 3న జరిగే సార్వత్రిక సమ్మెకు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ పారిశుధ్య కార్మిక యూనియన్ శుక్రవారం స్థానిక మున్సిపల్ మేనేజర్‌కు సమ్మె నోటీసులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్ర కాశం జిల్లా ఏఐటీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు బూసి సురేష్ బాబు, ఏఐటీయూసీ నాయకులు ఆనందమోహన్, పులి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించకపోతే జాబ్ కార్డు రద్దు : ఏపీడీ

ఉదయగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని శ్రామికులు ఈకేవైసీ చేయించకపోతే జాబ్‌కార్డు రద్దుచేయడం జరుగు తుందని ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ మృదుల పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో జరుగు తున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 1,26,032 లక్షల మంది జాబ్‌కార్డులు కలిగినవారు ఉన్నారన్నారు. ఇప్పటివరకు 58,106 మంది జాబ్ కార్డులు కలిగిన శ్రామికులకు ఈకేవైసీ పూర్తిచేయడం జరిగిందని, ఈనెల 20వ తేదీలోపు మిగిలిన జాబ్‌కార్డుల శ్రామికులకు ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఈసీ రవి, సాంకేతిక సహాయకులు రమణ, ప్రసన్న, క్షేత్ర సహాయకులు సయ్యద్ సందానీ, బొజ్జా నరసింహారావు, బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే నవంబరు 3వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీ యూసీ) నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు సమ్మె నోటీసును అందజేశారు. విధుల్లో మరణించిన, పదవీ విరమణ పొందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఔట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని, అదేక్రమంలో డైలీ వేస్ కార్మికులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా తీసుకోవాలని, కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఇలా ప్రభుత్వానికి అందజేసిన ఏడు న్యాయమైన సమస్యల పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సమ్మె తప్పదని తెలిపారు.



మూలస్థానేశ్వరాలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమం, మహా పూర్ణాహుతి, కలిశాభిషేకం జరిగాయి. ఉభయదాతలుగా డాక్టర్ గోపాలకృష్ణ, అంజనీ, మద్దిన విశ్వనాథం, బృంద, భావన, లక్ష్మీ దంపతులు వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.



రాజరాజేశ్వరికి పల్లకీసేవ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి శుక్రవారం రాత్రి పల్లకీసేవ జరిగింది. ఉదయం రాహుకాల పూజలు, కాత్యాయనీ వ్రతం, చండీ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కుంభ హారతులు జరిగాయి. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

● సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి న్యాయస్థానం కృషి చేస్తోందని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, రిటైర్డ్ జిల్లా జడ్జి వీ శ్రీనివాస అంజనేయ మూర్తి తెలిపారు. నగరంలోని రామ్మూర్తి నగర్ సబ్ డివిజన్‌లో శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు.



ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ శ్రీనివాస అంజనేయ మూర్తి

వినియోగదారులు ఫిర్యాదులను లిఖిత పూర్వకంగా అందజేశారు. వాటిని అక్కడికక్కడే పరిష్కరించినట్లు విద్యుత్ అధికారులు వెల్లడించారు. అంజనేయ మూర్తి మాట్లాడుతూ విద్యుత్ సేవల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లయితే సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు జీ మధుకుమార్, ఏ శ్రీనివాసబాబు, విజయలక్ష్మి, ఈఈ శ్రీధర్, డీఈలు సునీల్, ఆశోక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాండలికాలతోనే భాష సజీవం

● చిరస్మరణీయుడు శ్రీరామమూర్తి

● శత జయంతి ఉత్సవంలో మండలి బుద్ధ ప్రసాద్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాండలికాల తోనే భాష సజీవంగా ఉంటుందని, ప్రతీ పత్రిక ఆయా జిల్లాల మాండలికాల్లోనే వార్తలు ప్రచురించాలని శాసన సభ్యుడు, అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు మండలి బుద్ధ ప్రసాద్ కోరారు. శుక్రవారం రాత్రి నెల్లూరులోని ఓ హోటల్‌లో జమీన్ రైతు జీవ ప్రదాత నెల్లూరు శ్రీరామమూర్తి శత జయంతి వేడుక నిర్వహించారు. బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జమీన్‌రైతు పత్రికకు మహోన్నత చరిత్ర ఉందని, ఎవరైనా జర్నలిజంలో పరిశోధనలు చేయాలంటే జమీన్‌రైతు పత్రికపైనే చేయాలన్నారు. శ్రీరామమూర్తి పత్రికా రచనలో విశిష్టమైన శైలి ఉందన్నారు. ఆ పత్రిక జమిందారీ



శ్రీరామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బుద్ధ ప్రసాద్, టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ తదితరులు

చట్టానికి వ్యతిరేకంగా పుట్టి చట్టం రద్దును సాధించిందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే చిత్తూరు వెంకట శేషారెడ్డి మాట్లాడుతూ సర్పంచి నుంచి ఎమ్మెల్యేగా తనకు ప్రజాసేవ చేసే భాగ్యం కల్పించిన మహనీయుడు శ్రీరామమూర్తి అని తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ ఆర్‌ఎం బాషా మాట్లాడుతూ శ్రీరామమూర్తి క్రమశిక్షణ కలిగిన సంపాదకుడన్నారు. రాష్ట్ర విభజన వల్ల ఇరు రాష్ట్రాలు ఎంతో నష్టపోయాయని తెలిపారు. మళ్లీ ఉభయ తెలుగు రాష్ట్రాలు కలవాలని ప్రజల్లో ఆలోచన మొదలైందని చెప్పారు. ఈ కార్యక్రమానికి జమీన్‌రైతు పత్రిక సంపాదకుడు నెల్లూరు డోలేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి, యల్లసిరి గోపాలరెడ్డి, రఘురామ్ ముదిరాజ్, వెంకట రావు, కేవీ ఆర్ విజయ, జమీన్‌రైతు సిబ్బంది పాల్గొన్నారు.

2029 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రానున్న 2029 ఏడాది నాటికి నెల్లూరు నగరంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కార్పొరేషన్ కమిషనర్ నందన్ తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై అధికారులతో సమీక్ష జరిపారు. నగరంలో నిరక్షరా స్యులను గుర్తించాలని సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఎంపిక చేసి పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శకులుగా మారిన వారితో నిరక్షరాస్యులకు బోధన అందించాలని ఆదేశించారు. అనంతరం 1వ డివిజన్ నవలాకులతోట ప్రాంతంలో పారిశుధ్య పనులు, సీసీరోడ్ల నిర్మాణాలను పరిశీలించారు.



దీపావళి వేడుకల్లో పాల్గొన్న కళాశాల ప్రతినిధులు

'నారాయణ'లో ముందస్తు దీపావళి వేడుకలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా ఫోరం, నెల్లూరు హాబీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. అతిథిగా సెట్నల్ సీఈవో ఏ నాగేశ్వరరావు హాజరై ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కళాశాలలో పండుగలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు పండుగ విశిష్టతను తెలియచేసి, పర్యావరణాన్ని పరిరక్షించుకునేలా గ్రీన్ ఎన్విరాన్‌మెంట్‌లో దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దేవీ అలకరణలు, మట్టి దీపాలు, రంగోలీ డిజైన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో క్లబ్ కోఆర్డినేటర్ శ్రీలత, మేనేజ్‌మెంట్ సెక్రటరీ పీ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ హజరత్తయ్య, ఎంబీఏ డీన్ డాక్టర్ ధనుంజయ, పరీక్షల నియంత్రకుడు డాక్టర్ బీ వెంకటేశ్వర్లు హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు 'డీకేడబ్ల్యూ' విద్యార్థిని కీర్తన



విద్యార్థిని కీర్తనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమణారెడ్డి తదితరులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రంలో త్వరలో జరిగే జాతీయ బాక్సింగ్ పోటీలకు నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రళయకావేరి కీర్తన ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రమణారెడ్డి తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఆ విద్యార్థిని అభినందన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ విద్యా ర్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో కీర్తన అత్యుత్తమ ప్రదర్శనతో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించిందని పేర్కొన్నారు. జాతీయ పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పీ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎం వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేని టపాసుల దుకాణాలపై కేసులు

● రూరల్ సీఐ వేణు



టపాసుల దుకాణంలో మాట్లాడుతున్న సీఐ వేణు

నెల్లూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా అనుమతులు లేకుండా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తే వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు హెచ్చరించారు. శుక్రవారం ఆకస్మిక తనిఖీల్లో భాగంగా గుండ్లపాళెం, వడ్డిపాళెం, ఆకుతోట ప్రాంతాల్లో కార్పొరేషన్ సిటీప్లానింగ్ అధికారులతో కలిసి తనిఖీలు జరిపారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలను గుర్తించి తొలగించారు. టపాసుల విక్రయ కేంద్రాల్లో నీరు, ఇసుక, ఖాళీ స్థలం ఉండాలని, గోదాముల వద్ద వాహన పార్కింగ్‌ను దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పండుగ పూర్తయ్యే వరకు ఆకస్మిక తనిఖీలుంటాయని తెలిపారు.

నూతన ఉపాధ్యాయులకు ఐడీలు ఇవ్వాలి : యూటీఎఫ్

ఆత్మకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొంది నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు వెంటనే ఐడీలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్



సబ్‌ట్రెజరీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

(యూటీఎఫ్) నేతలు కోరారు. ఈమేరకు వారు శుక్రవారం స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేతలు మాట్లాడుతూ ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల పరిధిలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు హెచ్‌ఆర్‌ఎంఎస్ ఐడీల కోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఎంఈవోలు సబ్‌ట్రెజరీ కార్యాలయానికి అభ్యర్థనలు పంపించారన్నారు. వెంటనే సబ్‌ట్రెజరీ అధికారులు స్పందించి ఐడీ కార్డులు క్రియేట్ చేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం గంగాధర్, మాజీ జిల్లా కార్యదర్శి బి శివప్రసాద్‌రావు, ఆత్మకూరు మండల అధ్యక్షుడు ఎస్ మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష, కోశాధికారి మస్తాన్‌షరీఫ్, అనంతసాగరం మండల అధ్యక్షుడు వి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేకరీ ఉత్పత్తులతో స్వయం ఉపాధి

● కేవీకే కోఆర్డినేటర్ లలితా శివజ్యోతి



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ లలితాశివజ్యోతి, పక్కన ఆత్మ పీడీ తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో బేకరీ ఉత్పత్తుల తయారీ, వినియోగం వల్ల ఆరోగ్యంతోపాటు స్వయం ఉపాధికి అవకాశాలు ఉన్నాయని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ లలితాశివజ్యోతి తెలిపారు. నగరంలోని కేవీకేలో శుక్రవారం ఆత్మ ప్రాజెక్టు సౌజన్యంతో చిరుధాన్యాల బేకరీ ఉత్పత్తుల తయారీపై ఒకరోజు శిక్షణ తరగతులు జరిగాయి. ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని, ముఖ్యంగా గ్రామీణ మహిళలు ఇలాంటి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ సుజాత చిరుధాన్యాల ప్రాముఖ్యత, వాటి పోషక విలువ ఆధారిత బేకరీ ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారు. బిస్కెట్లు, కేకులు, కప్ కేకులు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మురళి, కేవీకే శాస్త్రవేత్తలు, మహిళా రైతులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్‌కు భూమి కేటాయించొద్దు

● తహసీల్దారుకు కాలనీవాసుల వినతి

ఉదయగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి పంచాయతీ కుర్ర పల్లి బీసీ కాలనీ సమీపంలో సోలార్ ప్లాంట్‌కు భూమి కేటా యించవద్దని శుక్రవారం కాలనీ వాసులు తహసీల్దారు ఎల్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీ సమీపంలో ఉన్న 161, 162 సర్వే నెంబర్లలోని 9 ఎకరాల భూమిని ప్రధానమంత్రి కుసుం పథకంలో భాగంగా నెడ్‌క్యాప్‌కు కేటాయిస్తున్నారన్నారు. ఆ భూమిలో కొందరికి ఇంటి నివేశన స్థలాలు మంజూరుచేసి ఉన్నారన్నారు. కాలనీలో ఇంకా చాలామంది ఇళ్లస్థలాలు లేని పేదలు ఉన్నారన్నారు. దానిని సోలార్‌ప్లాంట్‌కు కేటాయిస్తే కాలనీవాసులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, టీడీపీ నాయకులు పొన్నగంటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంగూరు రమాదేవి పుట్టినరోజు వేడుక



తెలుగు మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న రమాదేవి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పుట్టినరోజు వేడుకలు శుక్రవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగాయి. రమాదేవి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణ గెలుపు కోసం రమాదేవి కీలకంగా పనిచేశారని పలువురు టీడీపీ మహిళా నాయకులు కొనియాడారు. కాగా, రమాదేవి పుట్టినరోజు సందర్భంగా టీడీపీ నాయకులు మాగంట లే అవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

● నారాయణ ఆసుపత్రి వైద్యుడు గోపాలకృష్ణ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పీఎంపీ సభ్యులు తప్పనిసరిగా కార్డియో పల్మనాలజీ రీసెక్టిసియేషన్(సీపీఆర్) విధానంపై అవగాహన కలిగి ఉండాలని నారాయణ ఆసుపత్రి ఎమెర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ స్కంద గోపాలకృష్ణ సూచించారు. శుక్రవారం నారాయణ ఆసుపత్రిలో పీఎంపీ సభ్యులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు ప్రపంచ సీపీఆర్ అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నా యని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నారాయణ ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి, పీఎంపీ నాయకులు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, ఉప్పల పాటి రాందాసు, నంద్యాల మాలిని తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ



ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి : సీపీఎం ఆందోళన

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వనంతోపు సెంటర్‌లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలం టూ సీపీఎం నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పార్టీ నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, మధ్యతరగతి ప్రజలు, చిరు వ్యాపారులు ఉండే వనంతోపు సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతురాజు శ్రీనివాసులు, రఘురామయ్య, రమణ య్య, రత్నం, అల్లూరు శ్రీనివాసులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

● నవంబరు 17 నుంచి విస్తృత ప్రచారం ● సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ, విద్యా, సోషల్ వెల్ఫేర్, ఐసీడీఎస్ అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నవంబరు 17 నుంచి 30 వరకు కుష్ఠువ్యాధిపై ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నామని



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఎంహెచ్‌వో, డీఈవో తదితరులు

చెప్పారు. దీన్ని సమర్థవంతగా నిర్వహించేందుకు వైద్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ, వార్డుల్లో ఈ ప్రచారం చేపడుతూ ఎక్కడైనా కుష్ఠువ్యాధి కేసులు గుర్తిస్తే, వెంటనే సంబధిత ఆరోగ్య సిబ్బందికి తెలియచేయాలన్నారు. వ్యాధిగ్రస్థులు భయపడాల్సిన అవసరం లేదని, అన్నీ రకాల వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం కుష్ఠు వ్యాధి నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, జిల్లా కుష్ఠువ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఈవో బాలాజీరావు , ఐసీడీఎస్ పీడీ హేమా సుజన్, సోషల్ వెల్ఫేర్ డీటీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఆరోగ్యానికి జీవన ఎరువులు

● నేలలోని భాస్వరాన్ని కరిగిస్తాయి
● పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి
● కేవీకే సేద్యవిభాగం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎంతో కీలకం. ఇవన్నీ పంటల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా భాస్వరం మొక్క వేర్ల పెరుగుదలకు,గా పుష్పఫలాల ఏర్పాటుకు అత్యవసరం. అలాంటి భాస్వరం కలిగిన ఎరువులను విచ్చలవిడిగా వాడేస్తున్నారు. దీంతో నేలలో స్థిరపడిపోతున్న భాస్వరం వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోంది. అంతేకాక అంతకంతకు రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయి. నేలలోని ఈభాస్వరాన్ని కరిగించి, మొక్కకు ఉపయోగపడేలా చేయగలిగితే రైతులకు ఖర్చులు తగ్గుతాయి. అంతేకాక నేల ఆరోగ్యంగా ఉంటుందని చెబుతున్నారు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కాసా కిరణ్‌కుమార్‌రెడ్డి. ఇందుకు సంబంధించిన విషయాలను ఆయన ఆంధ్రజ్యోతి ద్వారా రైతులకు తెలియపరిచారు.

● విత్తనశుద్ధి

కిలో విత్తనానికి 10మి.లీ చొప్పున పీఎస్‌బీ జీవన ఎరువును బెల్లం జిగట పదార్థం లేదంటే గంజి జిగట పదార్థంతో కలుపుకుని గోనెసంచిలో, ప్లాస్టిక్ సంచిలో విత్తనాలతో కలిపి మెల్లగా కలియతిప్పాలి. అనంతరం పొడిగా ఉండేలా నీడలో ఆరబెట్టి పొలంలో విత్తుకోవాలి.

● నారు

లీటరు నీటికి 10మి.లీ పీఎస్‌బీ జీవన ఎరువును కలపాలి. లేదంటే 10లీటర్ల నీటికి 100మి.లీ పీఎస్‌బీ జీవన ఎరువును కలిపి అందులో 15-20 నిముషాలు మొక్కల వేర్లు పూర్తిగా మునిగేలా ఉంచుకోవాలి. ఆ తరువాత నాటుకోవాలి.

● పంటకు ఉపయోగపడని భాస్వరం

వ్యవసాయంలో భాస్వరం కలిగిన ఎరువులను(సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, డైఅమ్మోనియం ఫాస్ఫేట్, కాంప్లెక్స్ ఎరువులు) రైతులు అత్యధికంగా వాడుతున్నారు. పరిశోధన ప్రకారం ఆ ఎరువుల్లో కేవలం 15 నుంచి 20శాతం వరకు మాత్రమే భాస్వరం పంటకు అందుతోంది. మిగిలిన భాస్వరం నేల లో స్థిరపడిపోతోంది. అంటే అధికశాతం పంటకు ఉపయోగపడకుండా పోతుంది.



జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి(ఫైల్)

మొక్కలకు వేసిన భాస్వరం భూమిలో కొద్ది రోజుల్లోనే ఉదజని సూచిక(పీహెచ్)ను అనుసరించి వివిధ రకాలైన లభ్యంకాని భాస్వరం రూపంలోకి మారిపోతుంది. అది ఎలాగంటే ఆమ్లగుణం కలిగిఉంటే వేసిన భాస్వరం ఐరల్ లేదంటే అల్యూమినియం ఫాస్ఫేటుగా మారి మొక్కకు ఉపయోగపడడంలేదు. అలాగే క్షార గుణం కలిగిన ఉన్నప్పుడు వేసిన భాస్వరం కాల్షియం లేదంటే మెగ్నీషియం ఫాస్ఫేటుగా మారి పంటకు అందుబాటులో ఉండదు. దీంతో నేలలో భాస్వరం నిల్వలు అధికమవుతున్నాయి.

● భాస్వరం కరిగించే జీవన ఎరువులు

మట్టిలో అధికవవుతున్న లభ్యంకాని భాస్వరం నిల్వలను కరిగించి మొక్కలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జీవన ఎరువులు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఫాస్ఫేట్ సాల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ) కలిగిన జీవన ఎరువులు ఉపయోగించడం వల్ల నేలలోని లభ్యం కాని భాస్వరాన్ని కరిగించి మొక్కలకు అందుబాటులోకి తీసుకొస్తాయి. ఈజీవన ఎరువు ముఖ్యంగా బాసిల్లస్ మెగధీరియం, సూడోమోనాసులను ఉపయోగించి తయారు చేస్తారు. ఇది సమర్థవంతంగా పనిచేసేందుకు సేంద్రీయ కర్బనం ఎంతో ముఖ్యం. కాబట్టి ఈజీవన ఎరువుతో సేంద్రీయ ఎరువును వాడాలి. ఈజీవన ఎరువు భాస్వరాన్ని మొక్కకు అందించడంతోపాటు మొక్కల పెరుగుదలకు అవసరమైన హార్మోన్లను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తుంది. మొక్కల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. దీనివల్ల పంట దిగుబడులు పెరుగుతాయి.

బీఎస్ఎన్ఎల్ దీపావళి ఆఫర్

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ దీపావళి కానుకగా 4జీ సిమ్ ఉచితంగా అందజేయడంతో పాటు రూ.1 రీచార్జితో 30రోజులు ఫ్రీ కాల్స్, రోజూ 2జీబీ డేటా అందజేస్తున్నట్లు ఆ సంస్థ పీజీఎంటీడీ సీ.అమరేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సిమ్ కోసం వినియోగదారులు ఆధార్‌కార్డుతో కస్టమర్ కేర్ సెంటర్‌లో ధ్రువీకరించుకోవాలని కోరారు. ఉచిత సిమ్, రూ.1 రీచార్జి కోసం కస్టమర్ కేర్ రిటైలర్స్ డైరెక్ట్ సెల్లింగ్ ఏజంట్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశం నవంబరు 15 వరకు ఉంటుందన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సోమవారమే దీపావళి

● కొత్త నోములు లేవు..

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దీపావళిని సోమవారం రోజే నిర్వహించుకోవాలని వేద పండితులు తెలిపారు. ఆరోజే నరక చతుర్థశి, హారతులు, దీపావళి, ధనలక్ష్మీ పూజలు కూడా జరుపుకోవాలని సూచించారు. 21వతేదీ మంగళవారం కేదారేశ్వర నోములు వ్రతాలు ఆచరించుకోవాలని తెలిపారు. ఈ ఏడాది దీపావళి అమావాస్యకు, స్వాతి నక్షత్రం, స్వాతి కార్తె లేనందున కొత్త నోములు, ఏదైనా కారణంచేత ఆగిన నోములు, సూతకం చేత ఆగిన నోములు చేయరాదని పేర్కొన్నారు. 20న సాయంత్రం 5.30 నుంచి దీపావళి, ధనలక్ష్మి పూజ నిర్వహణ శుభప్రదంగా ఉంటుందని తెలిపారు. పితృకార్యాలు చేసేవారు 21న చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 25న నాగుల చవితి. ఆరోజు ఉదయం 7.35 నుంచి మధ్యాహ్నం 12.05 గంటలలోగా నాగేంద్రస్వామికి పుట్టలో పాలు పోయడం శుభప్రదమని వారు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి పర్వదినాలను జరుపుకోవాలన్నారు.

నగరంలో స్కానింగ్ కేంద్రాల తనిఖీ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం నెల్లూరు నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో అధికారులు సింహపురి స్కానింగ్ సెంటర్, అండాల్ భాస్కర్ ఆసుపత్రి, విజయ ఆసుపత్రుల్లో ఉన్న స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రతీ స్కానింగ్ సెంటర్ పీసీపీఎన్‌డీటీ నిబంధనల ను తప్పక పాటించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే స్కానింగ్ సెంటర్‌లపై చర్య లు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి సుధాకర్‌రావు, పబ్లిక్ ప్రైవేట్ మిక్స్ కోఆర్డినేటర్ హరీష్, విజయ్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ సరిత తదితరులు పాల్గొన్నారు.



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గూగుల్ రాకపై విమర్శలు విడ్డూరం : అజీజ్



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి గూగుల్ రావటంపై సంతోషం వ్యక్తం చేయాల్సిందిపోయి వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. నెల్లూరులోని అజీజ్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రపంచంలోనే అతి పెద్ద డేటా సెంటర్ రాష్ట్రానికి రావటం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఈ డేటా సెంటర్ రాష్ట్రానికి రావటంపై ప్రపంచ మొత్తం అసూయ పడుతుందన్నారు. అక్కడక్కడా వర్షానికి రోడ్లపై నీరు నిలిచినా అది కూటమి ప్రభుత్వానిదే తప్పిదమని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు ఐటీపై ఉన్న అనుభవం కారణంగా ఈ డేటా సెంటర్ వచ్చిందని చెప్పారు. దాదాపు కోటి ఇ ళ్లకు సరఫరా చేసే విద్యుత్ గూగుల్ సెంటర్‌కు అవసమని, ఆ విద్యుత్‌ను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.అదానీ డేటా సెంటర్ పోర్టుతో కలిపి రూ. 15వేల కోట్లు మాత్రమే పెట్టుబడి పెట్టారన్నారు. అయితే గూగుల్ రూ. 1.35 వేల కోట్లు పెట్టుబడి పెడుతుందని ఆయన చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉంటుందని నమ్మి నిర్ధారించుకున్న గూగుల్ సంస్థ ఈ పెట్టుబడులు పెడుతుందన్నారు. వైసీపీ నేతల పిచ్చికూతలను ఎవరూ నమ్మవద్దని ఆయన హితవు పలికారు.

జిల్లాలో రెండో రోజూ వర్షం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం కూడా వర్షం పడింది. గురువారం జిల్లాలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించిన వెంటనే భారీ వర్షం కురిసింది. రెండోరోజైన శుక్రవారం కూడా భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ తెలియచేసినా జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం పడింది. కొంతసేపు ఎండ కాసింది.

● అల్లూరు జోరు వర్షం

అల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా అల్లూరులో జోరుగా వర్షం కురుస్తోంది. రాత్రి సమయాల్లో వర్షం భారీగా కురుస్తుండడంతో పొలాల్లో సైతం నీరు చేరుతోంది. రైతులు రబీ సీజనుకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షాలు ప్రారంభం కావడంతో వారు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. విత్తనాల సేకరణలో మునిగి ఉన్న అన్నదాతలకు సకాలంలో వర్షాలు కురవడం మరింత ఉత్సాహన్ని కలిగిస్తోంది. ఇప్పటికే దుక్కి దున్ని అన్నదాతలు నారుమడులను సిద్ధం చేసుకునే పనిలో నివ ఎగ్గ వెై ఉన్నా రు. వారికి ఈ వర్షాలు మ రింత చేదోడుగా నిలుస్తున్నాయని రైతు లు పేర్కొంటున్నారు.

● నేడు ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం ఆత్మకూరులో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు స్వచ్ఛ దివస్‌లో భాగంగా హనుమాన్ జంక్షన్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలిస్తారు. అనంతరం జీఎస్టీ ర్యాలీలో పాల్గొంటారు. తదుపరి మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించే సభలో పాల్గొని 111 మంది లబ్ధిదారుల కుటుంబాలకు రూ.85.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు దుస్తులు, కిట్లు పంపిణీ చేస్తారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభిస్తారు.

20న ఏపీఎస్‌జీఆర్ ఈఏ సమావేశం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం లో ఈనెల 20న మధ్యాహం 3 గంటలకు నెల్లూరులోని టౌన్‌హాల్లో నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ. లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ. వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గసభ్యులు, తాలూకా యూనిట్ అధ్యక్షులు, కార్యదర్శులంతా హాజరు కావాలని వారు కోరారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్ల తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.



అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం



'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథా, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

తహసీల్దారుకు ఘన సన్మానం

సంగం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారుగా పనిచేస్తూ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన సోమ్లానాయక్‌ను శుక్రవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బందితోపాటు వీఆర్వోలు ఉన్నారు. అదేవిధంగా టీడీపీ సీనియర్ నాయకుడు కర్నాటి రవీంద్రరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గంగపట్నం చంద్రశేఖరయ్య తహసీల్దారును ఘనంగా సత్కరించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12455
వెండి కిలో ధర	రూ. 182000
వెండి ఒక గ్రాము	రూ. 191.00

న్యూస్ బాక్స్

శ్రీగంధం చెట్ల నరికివేతపై విచారణ

ఉదయగిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేట బీసీ కాలనీ సమీపాన గల గానుగపెంట నారాయణ రెడ్డి తోటలో శ్రీగంధం చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేయడంపై శుక్రవారం ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన దుండగులు నరికిన చెట్ల మోడులు, తోటలో వాహన జాడలను గుర్తించారు. అనంతరం రైతును అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతు ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

ఉదయగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంపల్లి గ్రామానికి చెందిన యగటీల వెంకటయోగేష్ బుధవారం మధ్యాహ్నం నుంచి అదృశ్యమైన విషయం విదితమే. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈక్రమంలో వెంకటయోగేష్ తాను తిరుపతిలో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వారు హుటాహుటిన అక్కడికెళ్లి విద్యార్థిని ఉదయగిరి స్టేషన్‌కు తీసుకొచ్చి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డికి విషయం తెలిపి ఇంటికి తీసుకెళ్లారు.

వైద్యుల సమ్మెకు సిబ్బంది మద్దతు

కలువాయి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వైద్యులు చేపట్టిన సమ్మెకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది మద్దతు తెలిపారు. పీహెచ్‌సీ ముందు నల్ల బ్యాడ్జీ లు ధరించి సంఘీభావం తెలిపారు

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి : సీఐ

సంగం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంగంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు సీఐ వేమారెడ్డి రెవెన్యూ అధికారులతో కలిసి శుక్రవారం స్థలం పరిశీలించారు. నివాసాలకు దూరంగా జనసంచారం తక్కువగా ఉండే శివాలయం సెంటర్‌లో టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనువుగా ఉంటుందని దుకాణదారులకు స్థలం కేటాయించారు. దుకాణదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సల్మా, వీఆర్వో, పోలీసులు, దుకాణదారులు ఉన్నారు.


సంగం: టపాసుల దుకాణాల ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న సీఐ వేమారెడ్డి, రెవెన్యూ అధికారులు

● **ఉదయగిరి:** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసే బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలని తహసీల్దారు ఎల్ రామ్మోహన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసే దుకాణాల స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద ఇసుక, నీళ్ల తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాల మధ్య దూరం పాటించడంతోపాటు జాగ్రత్తలు పాటిస్తూ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ధూమపానాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఫైర్ అధికారి హరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, వీఆర్వో మాలకొండయ్య, ఏఈలు వేణు, సురేష్, సర్వేయర్ వర్ధన్, సిబ్బంది, దుకాణదారులు, తదితరులు పాల్గొన్నారు.

● **సీతారామపురం:** దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటుచేసే వ్యాపారులు నిబంధనలు విధిగా పాటించాలని తహసీల్దార్ షేక్ ఫజిహా, ఎస్ఐ శివకృష్ణారెడ్డిలు సూచించారు. వారు శుక్రవారం బాణసంచా లైసెన్స్ దారులతో సమావేశం నిర్వహించారు. షాపులను ఒకే సముదాయంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. చిన్నపిల్లలకు టపాసులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. దుకాణాల వద్ద నీరు, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. లైసెన్సులు లేని వారు గ్రామాల్లో ఎక్కడైనా టపాసులను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. టపాసులు కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 100, 101, 112 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అనంతరం లైసెన్స్ దారులతో కలిసి టపాసుల దుకాణాల ఏర్పాటు కోసం స్థానిక మండల కార్యాలయాల ఎదురుగా గల ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. వ్యాపారులకు పలు సూచనలు, సలహాలను అందించారు.

సుప్రీంకోర్టు ఘటనపై ఎమ్మార్పీఎస్ నిరసన

కలువాయి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఘటనపై ఎమ్మార్పీఎస్ నేతలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బూటు విసిన రాకేష్ కషోర్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎస్‌పి నాయకులు చింతకుంట అంకయ్య మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ నరసయ్య, మండల నాయకులు దండు భార్గవ్ పాల్గొన్నారు.

● **వింజమూరు:** మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ గోచిపాతల ఆనంద్‌రావు మాదిగ, వింజమూరులోని బంగ్లా సెంటర్ నుంచి స్థానిక తహసీల్దారు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై బూటు విసిరిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానంలో పనిచేస్తున్న ఓ దళిత న్యాయమూర్తిపై ఇలాంటి ఘటన జరగడం హేయమైన చర్య అని వారు మండిపడ్డారు. గవాయిపై దాడి చేసిన రాకేష్ కిశోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక డిప్యూటీ తహసీల్దారుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మంద సుజాతమాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లెల తిరుమలేష్ మాదిగ, తదితర నాయకులు, పాల్గొన్నారు.


కలువాయి : తహసీల్దారు వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నూతన ఉపాధ్యాయులకు ఐడీలు ఇవ్వాలి : యూటీఎఫ్

ఆత్మకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డిఎస్సీలో ఉద్యోగాలు పొంది నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు వెంటనే ఐడీలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నేతలు కోరారు. ఈమేరకు వారు శుక్రవారం స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేతలు మాట్లాడుతూ ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల పరిధిలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు హెచ్‌ఆర్ఎంఎస్ ఐడీల కోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఎంఈవోలు సబ్‌ట్రెజరీ కార్యాలయానికి అభ్యర్థనలు పంపించారన్నారు. వెంటనే సబ్‌ట్రెజరీ అధికారులు స్పందించి ఐడీ కార్డులు క్రియేట్ చేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం గంగాధర్, మాజీ జిల్లా కార్యదర్శి బి శివప్రసాద్‌రావు. ఆత్మకూరు మండల అధ్యక్షుడు ఎస్ మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష, కోశాధికారి మస్తాన్‌షరీఫ్, అనంతసాగరం మండల అధ్యక్షుడు వి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సబ్‌ట్రెజరీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఈకేవైసీ చేయించకపోతే జాబ్‌కార్డు రద్దు : ఏపీడీ

ఉదయగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని శ్రామికులు ఈకేవైసీ చేయించకపోతే జాబ్‌కార్డు రద్దుచేయడం జరుగుతుందని ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ మృదుల పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో జరుగుతున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 1,26,032 లక్షల మంది జాబ్‌కార్డులు కలిగినవారు ఉన్నారన్నారు. ఇప్పటివరకు 58,106 మంది జాబ్‌కార్డులు కలిగిన శ్రామికులకు ఈకేవైసీ పూర్తిచేయడం జరిగిందని, ఈనెల 20వ తేదీలోపు మిగిలిన జాబ్‌కార్డుల శ్రామికులకు ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఈసీ రవి, సాంకేతిక సహాయకులు రమణ, ప్రసన్న, క్షేత్ర సహాయకులు సయ్యద్ సందానీ, బొజ్జా నరసింహారావు, బాబు, సిబ్బంది పాల్గొన్నారు.


ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ మృదుల

సోలార్ ప్లాంట్‌కు భూమి కేటాయించొద్దు

● తహసీల్దారుకు కాలనీవాసుల వినతి

ఉదయగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి పంచాయతీ కుర్రపల్లి బీసీ కాలనీ సమీపంలో సోలార్ ప్లాంట్‌కు భూమి కేటాయించవద్దని శుక్రవారం కాలనీ వాసులు తహసీల్దారు ఎల్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీ సమీపంలో ఉన్న 161, 162 సర్వే నెంబర్లలోని 9 ఎకరాల భూమిని ప్రధానమంత్రి కుసుం పథకంలో భాగంగా నెడ్‌క్యాప్‌కు కేటాయిస్తున్నారన్నారు. ఆ భూమిలో కొందరికి ఇంటి నివేశన స్థలాలు మంజూరుచేసి ఉన్నారన్నారు. కాలనీలో ఇంకా చాలామంది ఇళ్లస్థలాలు లేని పేదలు ఉన్నారన్నారు. దానిని సోలార్‌ప్లాంట్‌కు కేటాయిస్తే కాలనీవాసులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, టీడీపీ నాయకులు పొన్నగంటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ

ఆత్మకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే నవంబరు 3వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ విధుల్లో మరణించిన, పదవీ విరమణ పొందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఔట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని, అదేక్రమంలో డైలీ వేస్ కార్మికులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా తీసుకోవాలని, కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఇలా ప్రభుత్వానికి అందజేసిన ఏడు న్యాయమైన సమస్యల పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా నవంబరు 3 నుంచి నిరవధిక సమ్మెలోకి కార్మికులు వెళ్లక తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి బి హజరత్తయ్య, ప్రచార కార్యదర్శి దొమ్మరాజు వాసు, నాగేంద్ర, ట్రెజరర్ ఎం చెంచయ్య, పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి


మాట్లాడుతున్న అడిషనల్ కో ప్రాజెక్ట్ డైరెక్టరు వెంకట సుబ్బయ్య

ఏఎస్ పేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని అడిషనల్ కోప్రాజెక్ట్ డైరెక్టరు వెంకటసుబ్బయ్య సూచించారు. శుక్రవారం ఆయన జీసిడివో మమతతో కలిసి ఏఎస్‌పేటలోని కేజీబీవిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించాలని, 8,9వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. అనంతరం త్వరలో పదవీ విరమణ చేయనున్న వెంకటరమణమ్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ పిన్సిపాల్ బి శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై విద్యార్థులకు అవగాహన

ఉదయగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భూమి ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాబరేటరీ ఏడీఏ కన్నయ్య మట్టి నమూనాల సేకరణ, పరీక్షలు, ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ, స్థూల పోషకాల గురించి విద్యార్థులకు దృశ్యరూపంలో అవగాహన కల్పించారు. నేలతల్లిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఏడీఏ పీ చెన్నారెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏవో రామ్మోహన్, మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **సీతారామపురం :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జిల్లా సాయిల్ టెస్టింగ్ ఏడిఏ కన్నయ్య శుక్రవారం పాఠశాల విద్యార్థులకు మట్టి నమూనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, జిల్లా వనరుల కేంద్రం టెక్నికల్ ఏవో రామోహన్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

పిడుగుపడి యువకుడి మృతి


మృతి చెందిన మస్తానయ్య


వెంకటాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదగాలి పంచాయతీ శ్రీకాంత్ కా లనీలో శుక్రవారం తెల్లవారు జామున పిడుగుపాటుకు ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాంత్ కాలనీకి చెందిన అమ్మాటి మస్తానయ్య (26) ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తుండగా భారీ వర్షం మొద లైంది. పిడుగు పడడంతో మస్తానయ్య మృతి చెందగా ఇంట్లో మొబైల్, విద్యుత్ స్విచ్‌బోర్డులు పేలిపోయాయి. పక్కనే నిద్రి స్తున్న రెండేళ్ల కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. సీఐ సుబ్బా రావు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణీభవాని నాయుడు, నాయకులు పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, పొట్లూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఇంటర్ విద్యార్థి...


మృతి చెందిన దత్తాత్రేయ

కావలి రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య మృతి చెందడంతో పుట్టెడు దుఃఖం నుండి ఇంకా తేరుకోక ముందే విద్యుదాఘాతంతో కుమారుడు బోయన దత్తాత్రేయ (17) మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం కావలి మండలం ఆర్సీపాలెంలో జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బోయిన మాల్యాద్రి, అమీన దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. చిన్న కుమారుడు దత్తాత్రేయ పట్టణంలోని సాయి కోఆపరేటివ్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటి వద్ద ఉన్న మోటారుకు నీళ్ల రాకపోవటంతో మోటారును పరిశీలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడి కక్కడే మృతి చెందాడు. 15 రోజుల క్రితం అనారోగ్యంతో భార్య అమీన మృతి చెందింది. చిన్నకుమారుడు దత్తాత్రేయ మృతి చెందటంతో మాల్యాద్రి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాజిబాబు తెలిపారు.

శ్లాబ్ కూలి వ్యక్తి...


కూలిన శ్లాబు

నెల్లూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్లాబ్ కూలి చిరు వ్యాపారి మృతి చెందిన ఘటన నెల్లూరులో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని రంగనాయకుల పేట సోమిశెట్టి కల్యాణ మండపం సమీపంలో ఎన్ వెంకటేశ్వర్లుకు చెందిన గృహ సముదాయంలో బొమ్మా దయాకర్(47), లక్ష్మీ దంపతులు అద్దెకు నివసిస్తున్నారు. దయాకర్ స్థానికంగా టీ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోడ్డు మార్జిన్‌లో దుకాణం తొలగించడంతో ప్రస్తుతం తోపుడు బండిపై టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగానే శుక్రవారం కూడా తెల్లవారుజామునే టీ అమ్ముకునేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. కురుస్తున్న వర్షాల కారణంగా రెండో అంతస్తు సైడ్ శ్లాబ్ విరిగి దయాకర్‌పై పడింది. దీంతో వచ్చిన పెద్ద శబ్దంతో భార్య, చుట్టుపక్కల వారు బయటకు పరుగులు తీయగా అప్పటికే దయాకర్ అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించగా ఆ వాహనం సిబ్బంది వచ్చి పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో భార్య లక్ష్మీ ఫిర్యాదుతో సంతపేట సీఐ వైవీ సోమయ్య, ఎస్ఐ సుల్తాన్‌బాషా అక్కడికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్టర్‌పై మద్యం సీసాతో దాడి

నెల్లూరు(విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జేసీబీ కాంట్రాక్టర్ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి మద్యం బాటిల్‌తో దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని వేదాయపాళెం పరిధిలో ఉన్న త్యాగరాజనగర్ మూడో వీధిలో జేసీబీ కాంట్రాక్టర్ వీ కిషోర్‌కుమార్, అరుణ దంపతులు నివసిస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వారి ఇంటికి వచ్చి కాలింగ్ బెల్ కొట్టడంతో కిషోర్ తలుపులు తీశారు. వెంటనే ముగ్గురు దుండగులు ఇంటిలోకి ప్రవేశించి ఖాళీ మద్యం సీసాలతో కిషోర్‌కుమార్‌పై దాడి చేశారు. దీంతో బాధితుడు అపస్మార స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆయన భార్య గట్టిగా కేకలు వేయడంతో నిందితులు ముగ్గురూ పరారయ్యారు. చుట్టుపక్కల వారి సహాయంతో కిషోర్‌ను ఆసుపత్రికి తరలించారు. వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో గర్భిణికి పురిటి నొప్పులు

● అంబులెన్స్‌లో ఆసుపత్రిలో చేర్పించిన టోల్ ప్లాజా, హైవే సిబ్బంది

● ఏరియా వైద్యశాలలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం


ఆస్పత్రిలో ఆడశిశువుకు జన్మనిచ్చిన నాగలక్ష్మి

కావలి రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో నెల్లూరు ఆస్పత్రికి వెళుతుండగా పురుటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ముసునూరు టోల్ ప్లాజా సిబ్బంది మానవత్వంతో స్పందించి ఆదుకున్నారు. అంబులెన్సును పిలిపించి సకాలంలో ఆస్పత్రికి చేర్పించారు. గర్భిణి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణంలోని సంకులవారితోటలో గోపి, నాగలక్ష్మి దంపతులు నివశిస్తున్నారు. రెండవ కాన్పు కోసం నెల్లూరులోని నారాయణ వైద్యశాలకు తల్లి పద్మ, భర్త గోపీతో కలసి గర్భిణి నాగలక్ష్మి కావలి నుండి ఆర్టీసీ బస్సులో నెల్లూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో ముసునూరు టోల్ ప్లాజా వద్దకు వచ్చేసరికి నాగలక్ష్మికి పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలపగా, తోటి ప్రయాణీకులు ఆమెకు సపర్యలు చేస్తుండగా, విషయం తెలుసుకున్న టోల్ ప్లాజా మేనేజర్ గణేష్, సిబ్బంది, హైవే సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. హుటాహుటిన హైవే అంబులెన్స్‌లో ఆమెను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు ఉషాబాల, వెంకటలక్ష్మి, మాధవీలత సిబ్బంది 10 నిమిషాల వ్యవధిలోనే సాధారణ కాన్పు చేయగా, నాగలక్ష్మి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. టోల్ ప్లాజా, హైవే సిబ్బంది, ప్రయాణీకులు, వైద్యులకు నాగలక్ష్మి, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 560

ఏబీవీపీ నగర కమిటీ ఎన్నిక

కావలి (టౌన్) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కావలి నగర కమిటీని శుక్రవారం స్థానిక కోఆపరేటివ్ కాలనీలోని కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఏబీవీపీ నె ల్లూరు జిల్లా ప్రముఖ్ గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా డాక్టర్ చెరుకూరు ప్రభాకర్, సహాధ్యక్షుడిగా విజయ్, కార్యదర్శిగా చక్రి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గం గాధర్ మాట్లాడుతూ దేశభక్తి, దేశ రక్షణ ఏబీవీపీ ప్రధాన ఉద్దేశాలన్నారు. అనంతరం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. బ్రిడ్జి కూడలి ట్రంకు రోడ్డులోని బీఆర్ అంబేదర్కర్ విగ్రహానికి పూ లమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హేమంత్, జిల్లా మహిళా కన్వీనర్ కృతి, జిల్లా హాస్టల్స్ విభాగం కన్వీనర్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాకేశ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

కావలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిచేసిన రాకేశ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం కావలి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ పీ. శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు చేవూరు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ ఎంఈఎఫ్ నాయకులు మంద వెంకటేశ్వర్లు మాదిగ, అక్కిలగుంట ఏసురత్నం మాదిగ, ఎంఎస్‌పీ నాయకుడు కత్తి శివ మాదిగ, మనోహర్ మాదిగ, రామమోహన్ మాదిగ, చేవూరు ఆదిత్య మాదిగ, జాన్సన్ మాదిగ, శ్యామ్యూల్ మాదిగ తదతరులు పాల్గొన్నారు.

దగదర్తిలో..

దగదర్తి(బిట్రగుంట): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని వెంకటే శిక్షించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు డిమాండ్ చేశారు. దగదర్తి మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి కావలిశ్రీనివాస్ మాదిగ, కో ఇన్‌చార్జి నూనె జనార్దన్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఎమ్మార్పీఎస్ కావలి నియోజకవర్గ ఇంచార్జి గోచిపాతల వెంకటేశ్వర్లు, తలారి రవికుమార్, మంచు తిరపతి, కప్పలనారాయణ, మావులూరి మస్తాన్, వీరనారాయణ, శీనయ్య, చంద్ర, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత రక్త పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది

కావలి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్‌లోని గిరిజన సంక్షేమ బాలుర ఆవాస పాఠశాలలో శుక్రవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ శ్యాం సుధాకర్ ఆధ్వర్యంలో 140 మంది విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ, హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ డీ. రవిప్రకాష్, రెడ్‌క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రాళ్లపాడుకు సోమశిల జలాలు విడుదలకు వినతి

లింగసముద్రం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల ప్రాజెక్టు నీటిని విడుదల చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాంశు శుక్లాను ప్రాజెక్టు ఈఈ జి మునిరత్నం కోరారు. శుక్రవారం ఈఈ మునిరత్నం, డీఈఈలు ఎం వెంకటేశ్వర్లు, పి శేషయ్యలు నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి రాళ్లపాడు ప్రాజెక్టు వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. సోమశిల నుంచి నీటిని రాళ్లపాడు ప్రాజెక్టుకు విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కలెక్టర్ సానుకూలంగా స్పందించి సోమశిల ఎస్ఈ ఎంవి రమణారెడ్డితో ఫోన్‌లో నీటి విడుదల గురించి మాట్లాడారు. ఈనెల 22 తర్వాత నీటి విడుదలకు తీసుకుంటారని కలెక్టర్ తెలియజేసినట్లు ఈఈ మునిరత్నం తెలిపారు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

లింగసముద్రం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు మంచినీటి పథకానికి చెందిన పెంట్రాల వద్ద ఉన్న వాటర్ ట్రీట్‌మెంటు మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని మండల ఆర్‌డబ్ల్యూఎస్, మంచినీటి పథకాల ఏఈఈ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన వాటర్ ప్లాంటు మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం నీటిని విడుదల చేసి 48 గ్రామాల ప్రజలకు అందిస్తామని చెప్పారు. ఏఈఈ రాజశేఖర్ వెంట పథకం నిర్వాహకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు

కందుకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 3న జరిగే సార్వత్రిక సమ్మెకు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ పారిశుధ్య కార్మిక యూనియన్ శుక్రవారం స్థానిక మున్సిపల్ మేనేజర్‌కు సమ్మె నోటీసులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏఐటీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు బూసి సురేష్ బాబు, ఏఐటీయూసీ నాయకులు ఆనందమోహన్, పులి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

24న హుండీల లెక్కింపు

వలేటివారిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం కొండపైన కల్యాణ మండపంలో ఈనెల 24న హుండీల లెక్కింపు జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు హుండీల లెక్కింపు ప్రారంభమతుందన్నారు.

ఘనంగా 16 రోజుల పండుగ

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల సమీపంలోని శ్రీదత్తాత్రేయస్వామి మందిరం వద్ద శుక్రవారం 16 రోజుల పండుగను భక్తులు జరుపుకున్నారు. దసరా పండుగ నవరాత్రుల సందర్భంగా భవానీ కంకణ దీక్ష తీసుకున్న స్వాములు శుక్రవారం అమ్మవారికి 16 రోజుల పండుగ నిర్వహించారు.

సుప్రీంకోర్టు ఘటనపై ఎమ్మార్పీఎస్ నిరసన



కందుకూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై సీనియర్ అడ్వకేట్ రాకేష్ కిషోర్ చేసిన దాడిని ఖండిస్తూ శుక్రవారం కందుకూరులో అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఎంఆర్ పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం తహసీల్దార్ లావణ్యకు వినతి పత్రాన్ని అందించారు. నిరసన ర్యాలీ లో ఎంఆర్‌పీఎస్ నాయకులు కాంతారావు మాదిగ, చదలవాడ కిట్టు, రావినూతల ముత్తుమాదిగ, వినయ్ మాదిగ, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

●**ఉలవపాడు :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై బూటు విసిరి దాడిచేసిన సీనియర్ న్యాయవాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తు శుక్రవారం మండల కేంద్రం ఉలవపాడులో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని సిబ్బందికి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ముత్తమాదిగ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఆర్ మోహన్, ఐజాక్, గోపాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి



దారకానిపాడులో లక్ష్మయ్య నాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

గుడ్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారకానిపాడులో ఇటీవల కారుతో ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టడంతో మరణించిన యువకుడు తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడి కుటుంబాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం పరామర్శించారు. ఈ ప్రమాదం జరిగిన తీరును, గతంలో ఆ ఇద్దరి మధ్య జరిగిన వివాదాల గురించి మృతుని కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం మాల్యాద్రి, జనిగర్ల నాగరాజు, ఉన్నం వెంకటేశ్వర్లు, చిత్తారి మల్లికార్జున, నరాల మాలకొండారెడ్డి, చుండూరి వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ఇంటూరి

●**వలేటివారిపాలెం:** మండలంలోని కళవళ్లలో అబ్బూరి గంగయ్య కుమారుడు శ్రీనివాస్ వివాహానికి శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు, వలేటివారిపాలెం మండల టీడీపీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు నార్నే రోశయ్య, మోదేపల్లి నారాయణ, మోదేపల్లి మాలకొండయ్య, మోదేపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.













ఉరకలెత్తిన ఉత్సాహం

అటు పాట.. ఇటు ఆట.. ఇంకోవైపు బొమ్మలు గీయడం.. ఇలా విభిన్న అంశాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. 'యువతరంగ్'లో భాగంగా శుక్రవారం ఎస్వీయూలో సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహంగా సాగాయి.

- వివరాలు 8లో -

కలెక్టరేట్‌కు మళ్లీ బాంబు బెదిరింపు

● పేల్చేస్తామంటూ మెయిల్ ● ఉత్తిదే అని తేల్చిన పోలీసులు



తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌కు మరోసారి ఫేక్ బాంబు బెదిరింపు వచ్చింది. 'కలెక్టర్ అన్నయ్యా.. మేము మద్రాస్ టైగర్స్ జైలులో ఉన్న టీఎస్ఎల్‌ఏ నాయకుడు ఎస్.మారన్ సైబర్ గొరిల్లాల విభాగం. పాకిస్తాన్, ఐఎస్ఐ తదితరుల సాయంతో పేలుళ్లకు పాల్పడుతున్నాం. కలెక్టర్ కార్యాలయంలో ఐదు శక్తిమంతమైన బాంబులు అమర్చబడ్డాయి. అవి మధ్యాహ్నం పేలుతాయి' అంటూ తమిళనాడు నుంచి తిరుపతి ఆర్డీవో, కలెక్టర్ అధికారిక మెయిళ్లకు శుక్రవారం వేకువజామున 3.38 గంటలకు మెయిల్ వచ్చింది. దీంతో జిల్లా యంత్రాంగం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాంబు.. డాగ్ స్క్వాడ్లు కలెక్టరేట్‌కు చేరుకుని అణువణువునా తనిఖీ చేశారు. అది ఉత్తుత్తి ఫేక్ మెసేజ్ అని పోలీసులు నిర్ధారించడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ తనిఖీల్లో తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, సిబ్బంది కూడా పాల్గొన్నారు.

నా చావుకు నా భార్యే బాధ్యురాలు


నిరంజన్ (ఫైల్‌ఫొటో)

● పోలీసులు, కుటుంబీకులకు వాట్సప్ మెసేజ్
● ఆపై సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

ఏర్పేడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తన చావుకు తన భార్య ప్రధాన బాధ్యురాలంటూ వాట్సప్ ద్వారా కుటుంబ సభ్యులు, పోలీసులకు గురువారం రాత్రి మెసేజ్ పంపి.. సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటన ఏర్పేడు మండలం కందాడు దళితవాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. యానాదయ్య, సాయమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు బొంద నిరంజన్(28) సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్నారు.ఏర్పేడు మండలం పాతవీరాపురం సచివాలయంలో నాలుగేళ్ల పాటు పనిచేసిన ఆయన ఇటీవల శ్రీకాళహస్తి మండలం బీవీపురం సచివాలయానికి బదిలీ అయ్యారు.ఏడాది కిందట కందాడుకు చెందిన చంద్రిక,సుబ్రహ్మణ్యం కుమార్తె విద్యాప్రియను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈమె ప్రస్తుతం 8 నెలల గర్భిణి. మూడు నెలలుగా విద్యాప్రియ కుటుంబ సభ్యులు, నిరంజన్ మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో కందాడు పంచాయతీలోని డంపింగ్‌యార్డు సమీపంలోని ఓ షెడ్డులో ఉరేసుకున్నారు. దీనికి ముందే ఏర్పేడు పోలీసులకు, కుటుంబ సభ్యులకు వాట్సప్ ద్వారా మెసేజ్ పంపారు. 'నా భార్య, అత్త చంద్రిక, పెద్దత్త హేమలత కొద్దిరోజులుగా ఇబ్బంది పెడుతున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడొద్దంటున్నారు. నా భార్యతోనే ఉండాలని, లేదంటే కట్నం కేసు పెడతామని బెదిరిస్తున్నారు. వీటన్నింటికీ ఆధారాలున్నాయి. అత్తింటి వారు నా భార్యతో కలిసి నన్ను చంపేదాకా తీసుకొచ్చారు. విద్యాప్రియకు వేరే పెళ్లి చేస్తామంటూ మూడు నెలలుగా ఇబ్బంది పెడుతున్నారు. చేయని అప్పులకు సంతకాలు పెట్టించుకున్నారు. ఆ డబ్బుతో ఏడాది పాటు వారు విలాసంగా గడిపారు. దయచేసి వీరెవరినీ వదలొద్దు. నా భార్యే ప్రధాన బాధ్యురాలు' అంటూ ఆ మెసేజీలో పేర్కొన్నారు. దానికి సంబంధించి కాల్‌డేటా తీసి న్యాయం చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. నిరంజన్ మెసేజీ ఆధారంగా ఆయన భార్య విద్యాప్రియ, అత్తమామలు చంద్రిక, సుబ్రహ్మణ్యం, పెద్దత్త హేమలతపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

అమ్మా నాన్నా సెలవివ్వండి

'అమ్మా నాన్నా.నన్ను క్షమించండి.ఇక సెలవు ఇవ్వండి. ఇంకో జన్మలో మిమ్మల్ని బాగా చూసుకుంటా. ఈ జన్మలో మీకు న్యాయం చేయలేక పోయా. నన్ను క్షమించండి ప్లీజ్. నా చావుకు కారణమైన వారిని వదలొద్దు. వాళ్లు నన్ను పెట్టిన ఇబ్బందులన్నీ నా మొబైల్‌లో ఉన్నాయి. వాటి ఆధారంగా వారిపై చర్యలు చేపట్టవచ్చు' అంటూ తల్లిదండ్రులకు పంపిన మెసేజీలో పేర్కొన్నారు.

శ్రీగంధాన్నీ వదల్లేదు

శేషాచల అడవుల్లో నరికేస్తున్న 'ఎర్ర' స్మగ్లర్లు

తలలు పట్టుకుంటున్న టాస్క్‌ఫోర్సు, అటవీశాఖ అధికారులు



మంగళం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శేషాచల అడవుల్లో ఎర్రచందనం చెట్లను నేలకూలుస్తున్న స్మగ్లర్ల దృష్టి శ్రీగంధంపై పడింది. శేషాచల కొండల్లోకి తొలుత అడుగుపెట్టిన స్మగ్లర్లు అటవీశాఖ గుర్తించడానికి ముందే శ్రీగంధంచెట్లను నరికి తరలించేశారు. ఆ తర్వాత ఎర్రచందనంపైకి దృష్టి మళ్లించారు. తాజాగా ఇప్పుడు శ్రీగంధం చెట్లపై కూడా దృష్టి సారించారని తెలుస్తోంది. ఇందుకు నిదర్శనం నాలుగు రోజుల కిందట తిరుమల కొండల్లోని జపాలి వద్ద శ్రీగంధం చెట్టు మొదళ్లతో పాటు పెకలించి తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకోవడం. అంతకుముందు కపిలతీర్థం వద్ద శ్రీగంధంచెట్లను వేళ్లతో పెకలించి అక్రమంగాతరలిస్తూ అటవీశాఖ అధికారులకుచిక్కారు. దీంతో అటవీశాఖ, టాస్క్‌ఫోర్సు అధికారులు ఏం చేయాలో తెలియక తలలుపట్టుకుంటున్నారు. ఎర్రచందనం కన్నా శ్రీగంధానికి అధిక డిమాండ్, ధర ఉండటంతో శేషాచల కొండల్లోని చిన్నపాటిశ్రీగంధం చెట్లనూ స్మగ్లర్లు వదిలిపెట్టడం లేదు. ఇలా శ్రీగంధం చెట్లను స్మగ్లర్లు నరికి తరలిస్తుండటంతో టీటీడీ.. తిరుమల కొండలపై ప్రత్యేకంగా శ్రీగంధం వనానికి శ్రీకారంచుట్టింది. 60 హెక్టార్లలో లక్షలాది మొక్కలు నాటి వాటిచుట్టు కంచె వేసి కాపాడుకుంటోంది. ఈ నేపథ్యంలో స్మగ్లర్లు.. ఇక్కడి శ్రీగంధం వనంపై ఎక్కడ చూపు పడుతుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే స్మగ్లర్లు తరలిస్తుండగా పట్టుకున్న శ్రీగంధం నాలుగు టన్నుల వరకు చిత్తూరులోని గోదాములో ఉంది. ఇక, అటవీశాఖ, పోలీసులకు చిక్కకుండా ఎంతమేరకు శ్రీగంధం రాష్ట్ర సరిహద్దులు దాటిందో అంతుచిక్కని పరిస్థితి. ఈ క్రమంలో టీటీడీ పరిధిలోని శ్రీగంధం చెట్లకు స్మగ్లర్ల బెడద లేకపోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

33 పరిశ్రమలకు రూ.5.49 కోట్ల ప్రోత్సాహకం



తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు, యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 33 పరిశ్రమలకు రూ.5.49 కోట్ల ప్రోత్సాహకాలకు ఆమోదం తెలిపామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం చంద్రశేఖర్, జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి అధికారులు రమణయ్య, మురళీమోహన్, రవికుమార్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

మీకవసరమైన సౌకర్యాలన్నీ కల్పిస్తాం

● అంబత్తూరు పారిశ్రామికవేత్తలతో కలెక్టర్, ఎమ్మెల్యే ● కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుపై సమీక్ష


పారిశ్రామిక వాడపై సమీక్షిస్తున్న కలెక్టర్ సుమీత్‌కుమార్, ఎమ్మెల్యే భాను

విజయపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విజయపురం మండలాన్ని పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని కలెక్టరు సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుపై అంబత్తూరు ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రతినిధులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోసలనగరం పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ఎ- బ్లాక్‌లో 1500 ఎకరాల భూమిని గుర్తించామన్నారు. పారిశ్రామిక వాడకు అవసరమైన నీటి సదుపాయం, రోడ్డు, కరెంటు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా నీరు నిరంతరాయంగా సరఫరా చేస్తామన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్టాంప్ డ్యూటీని ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. పారిశ్రామిక హబ్‌తో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సమస్యలపై పిర్యాదులను స్వీకరించారు. అంబత్తూరు ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రతినిధి, సప్తగిరి హైమా ఇండస్ట్రియల్ పార్కు అధ్యక్షుడు హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు ఆర్వేల రమేష్ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో తామంతా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చామన్నారు. ఎకరా భూమి ధర రూ20 లక్షల లోపు అందిస్తామని కలెక్టరు హామీ ఇవ్వడంతో రెండు నెలల్లో ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.ఆర్డీవో అనుపమ, ఆర్‌అండ్‌బీ డీఈ సుజాత, తహసీల్దార్ కిరణ్, ఏపీఐఐసీ అధికారులు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనంజయ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబు యాదవ్, నాయకులు బాలసుబ్రమణ్యం రాజు, లోకేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయ కేంద్రాల్లో నిబంధనలు పాటించండి



● జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రమణ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రమణ విజ్ఞప్తి చేశారు. ఎక్కడా ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తాము జిల్లా వ్యాప్తంగా దాదాపు 230 టపాకాయల విక్రయాల కేంద్రాలకు అనుమతులు ఇచ్చామన్నారు. ఆయా రెవెన్యూ డివిజన్ల పరిధిలో దుకాణాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేసుకోవాలనేది ఆర్డీవోలు పరిశీలించి తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేస్తారని చెప్పారు. తిరుపతి మున్సిపల్ పరిధిలో ఉన్నందున కమిషనరు లైసెన్సులు మంజూరు చేస్తారని, మిగిలిన అన్ని చోట్లా దాదాపు 190 విక్రయ కేంద్రాలకు అనుమతులు ఇవ్వడం జరిగిందని చెప్పారు.

● బాణాసంచా విక్రయ కేంద్రాల చుట్టూ దాదాపు 6 మీటర్ల వరకు ఖాళీగా ఉంచాలి. ● నివాస ప్రాంతాలకు 1.5 కిలోమీటర్ల దూరంలోనే టపాసుల విక్రయాలను చేపట్టాలి. ● కనీసం రెండు గంటల పాటు అగ్గిని తట్టుకునేలా షెడ్డు వేసుకోవాలి. ● ఫైర్ అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలి. ఇసుక బస్తా, 220 లీటర్ల సామర్థ్యమున్న డ్రమ్ముల్లో నీళ్లు, సల్ఫర్, గన్ పౌడర్, రెండు అగ్నినిరోధక సిలిండర్లు తదితరాలను అందుబాటులో ఉంచుకోవాలి. ● దుకాణాల మధ్య కనీసం మూడు మీటర్లు దూరం వుండాలి. ● ఒక గ్రౌండులో 50 దుకాణాలకు మించి ఏర్పాటు చేయకూడదు. ● ఆపద, అత్యవసర పరిస్థితులు ఏర్పడితే డయల్ 112 లేదా 101కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న విద్యాశాఖాధికారులు

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు రెండు ప్రాజెక్టుల ఎంపిక

తిరుపతి(విద్య), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ పోటీలకు రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. తిరుపతినగరం పద్మావతిపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో శుక్రవారం జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు జరిగాయి. మొత్తం 45 ప్రాజెక్టులు పాల్గొన్నాయి. వీటిలో తిరుపతికి చెందిన టీటీడీ ఎస్‌జీఎస్ హైస్కూల్ నుంచి దత్తసాయి చరిష్మ.. వరదయ్యపాళెం కారిపాకం జడ్పీ హైస్కూల్ మునిలోహిత.. గూడూరు జడ్పీ హైస్కూల్ సాగర్ కుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. వీటిలో రెండు రాష్ట్రస్థాయి పోటీల్లో పోటీపడనున్నాయి. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, డీవైఈవో ఇందిరాదేవి, ఎంఈవో పద్మజ, అధికారులు ఎన్‌టీ పురుషోత్తమ, గౌరీశంకర్, సురేష్, హెచ్ఎం మురళి పాల్గొన్నారు.

శ్రీవారికి విరాళంగా కొప్పెర గంగాళం



తిరుమల/తిరుపతి రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం కొప్పెర(హుండీ) గంగాళం విరాళంగా అందింది. తిరుపతి సమీపంలోని కొప్పెరవాండ్లపల్లెకు చెందిన కొప్పెర సాయిసురేష్ ఈ హుండీ గంగాళాన్ని ఆలయ పోటు పేష్కార్ మునిరత్నంకు అందజేశారు. రాగి, ఇత్తడి కలిపి తయారు చేసిన ఈ హుండీ బరువు 70 కిలోలు ఉంటుందని, దీని విలువ రూ.2.50 లక్షలని దాత తెలిపారు. తాము 1821 నుంచి వంశపారంపర్యంగా స్వామికి కొప్పెర గంగాళాలను సమర్పిస్తున్నామని వివరించారు. అంతకుముందు కొప్పెరవాండ్లపల్లెలోని వినాయకస్వామి ఆలయంలో కొప్పెర వంశస్థులు ఈ గంగాళానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 8వ తరానికి చెందిన సాయిసురేష్ కుటుంబీకులు ఈ గంగాళాన్ని తిరుమలకు తీసుకెళ్లారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు




తల్లితో నారా రోహిత్ - లతా బస్వరాజ్ పాట్నే

తిరుమల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. హైదరాబాద్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్) జ్యుడిషియల్ సభ్యురాలు లతా బస్వరాజ్ పాట్నే, ఆర్ఎస్ఎస్ సీనియర్ ప్రచారక్ మంగేష్, జాతీయ బాలల హక్కులు, సంరక్షణ కమిషన్ సభ్యులు ఆర్జీ ఆనంద్, సినీ హీరో నారా రోహిత్ ఉన్నారు.

దర్శనానికి వెళ్లి.. మా ఆయన తిరిగి రాలేదు!



శ్రీనివాస్ (ఫైల్ ఫొటో)

● రెండున్నర నెలల తర్వాత తిరుమల పోలీసులను ఆశ్రయించిన కాకినాడ జిల్లా వాసి

తిరుమల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీనివాసుడి దర్శనానికి వెళ్లిన మా ఆయన తిరిగి రాలేదు. ఆచూకీ తెలిస్తే చెప్పండి' అంటూ కాకినాడ జిల్లాలోని తాళ్లరేవు మండలం నీలపల్లి గ్రామానికి చెందిన పల్లా శ్రీదేవి కోరుతున్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త పల్లా శ్రీనివాస్(32), కొడుకుతో కలిసి ఆగస్టు 2న తిరుమలకు చేరుకున్నట్టు చెప్పారు.ఆలయంలోకి తాను రాకూడదని శ్రీదేవి చెప్పడంతో కుమారుడిని భార్యకు జత చేసి,పీఏసీ1 వద్దనున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం దగ్గరే కూర్చోమని చెప్పి పల్లా శ్రీనివాస్ దర్శనానికి వెళ్లారు. ఆ తర్వాత ఎంతకీ ఆయన తిరిగి రాలేదు. ఇద్దరి దగ్గరా సెల్‌ఫోన్లు లేవు. తాము కనిపించలేదని సొంతూరికి వెళ్లిపోయి ఉంటాడని ఆమె బిడ్డతో కలిసి తమ గ్రామానికి చేరుకున్నారు. భర్త ఆచూకీ లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో విచారించాక శుక్రవారం తిరుమలకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పల్లా శ్రీనివాస్ ఆచూకీ తెలిసిన వాళ్లు 94407 96772, 0877 2289031 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఉరకలెత్తిన ఉత్సాహం

● ఎస్వీయూలో సాంస్కృతిక ప్రదర్శనల హోరు

● నేటితో ముగియనున్న యువతరంగ్







పాడుతా.. తీయగా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రెండో రోజైన శుక్రవారం యువతరంగ్- 2025 కార్యక్రమం వైభవంగా సాగింది. సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు తమ కళా ప్రదర్శనలతో హుషారెత్తించారు. ఇండియన్ గ్రూప్ సాంగ్, వెస్టర్న్ గ్రూప్ సాంగ్, వెస్టర్న్ సోలో ఇన్‌స్ట్రుమెంటల్, ఇండియన్ క్లాసికల్ డాన్స్, ఫోక్ డాన్స్, ట్రైబల్ డాన్స్‌తోపాటు వక్తృత్వం, చర్చాగోష్ఠి, స్పాట్ పెయింటింగ్, కార్టునింగ్ వంటి పోటీలు నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన స్థానిక విద్యార్థులతో వర్సిటీలో సందడి నెలకొంది. ఆయా కార్యక్రమాల్లో స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్, కల్చర్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ రంజిత్ కుమార్, స్వరూప్, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో నేడు: మిమిక్రీ, మైమ్, స్కిట్, ఏకాంకిక, ఫోక్ ఆర్కెస్ట్రా, క్రియేటివ్ కొరియోగ్రఫీ, క్విజ్, క్లే మోడలింగ్, రంగోలీ వంటి పోటీలను శనివారం నిర్వహిస్తారు. కాగా, శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు హాజరు కానున్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.



యువత ఉత్సాహం

ఎస్వీయూలో నేడు సాధారణ పని వేళలు

ప్రతి మూడో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎస్వీయూలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తుంటారు. యువతరంగ్ సందర్భంగా సాధారణ పని వేళలు (ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు) ఉంటాయని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.




సుబ్రహ్మణ్యస్వామికి కావళ్ల మొక్కు - జాతరమ్మో జాతర





పంచెకట్టు అదుర్స్

జనసేన బహిష్కృత నేత అరెస్టు

వెంకటగిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణానికి చెందిన జనసేన బహిష్కృత నేత గూడూరు వెంకటేశ్వర్లును పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఉద్దేశించి సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా ఆయనను టీడీపీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు కోట వినుతకు న్యాయం చేయాలని పోస్టులు పెట్టాడు. దీనిపై ఫిర్యాదు అందడంతో వెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రేణిగుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఇక్కడి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో చిత్తూరు డీఐజీ, తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. నిషేధిత జాబితాలోని భూములను కోర్టు ద్వారా తెచ్చుకున్న ఆర్డర్లను దొడ్డిదారిలో చూపి రిజిస్ట్రేషన్లు చేసినట్లుగా గుర్తించినట్లు తెలిసింది. అలాగే రిజిస్ట్రేషన్ నెంబర్లు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. తిరుపతి రూరల్‌లోని దేవదాయ శాఖకు సంబంధించిన నిషేధిత జాబితాలోని సర్వే నెం.242లో నిర్మించిన డూప్లెక్స్ విల్లాలు, భవంతులకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తించినట్లు చెబుతున్నారు. పలు రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వాదాయానికి గండిపడడాన్ని తనిఖీల్లో గుర్తించినట్లు తెలిసింది. కాగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి సెలవుపై విజయవాడకు వెళ్లడం గమనార్హం. ఈ తనిఖీల వివరాలను వెల్లడించడానికి అధికారులు నిరాకరించారు.

సీనియర్ల మంచి సలహాలను అనుసరించండి

● సన్మాన సభలో విశ్రాంత సీఎండీ సంతోషరావు



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఏ సంస్థలోనైనా సీనియర్ల మంచి సలహాలను అనుసరించినప్పుడు మంచి ఫలితాలు వస్తాయని సదరన్ డిస్కం విశ్రాంత సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. రేణిగుంట మండలం తూకివాకం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు, రైతులకు, పారిశ్రామిక వేత్తలకు ఉత్తమ సేవలందించామని చెప్పారు. అధికారుల నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా పర్యవేక్షించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని విశ్రాంత సీఎండీలు కలాల రంగనాథం, పి.గోపాల్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా విశ్రాంత సీఎండీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, రామమోహనరావు, సీజీఎంలు శోభావాలంటీన, రమణాదేవి, ఉమాపతి, ఆదిశేషయ్య, జానకిరాం, జీఎం ఎం.కృష్ణారెడ్డి, ఎస్ఈలు ఎస్. రమణ, వి.చంద్రశేఖర్ రావు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అండర్ 14 బాలబాలికల హాకీ జిల్లా జట్టు ఎంపిక



హాకీ జిల్లా జట్టుకు ఎంపికైన బాలబాలికల జట్టు

చంద్రగిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం బాలబాలికల హాకీ జిల్లా జట్టును ఎంపిక చేశారు. శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 60 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 170 క్రీడా కారులకు హాకీ పోటీలు నిర్వహించారు. అందులో 25 మంది చొప్పున బాలబాలికలను ఎంపిక చేశారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో చంద్రగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో బాలబాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శారద, వెంకటరమణారెడ్డి, స్కూల్ గేమ్స్ సెక్రటరీ కిషోర్‌కుమార్, పీఈటీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోదీ సభతో ప్రజాధనం వృథా

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్




తిరుపతి(కల్చరల్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : కర్నూలులో ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ సభతో రూ.15కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉన్న సమయంలో ప్రజల సొత్తును ఈ రకంగా ఖర్చు చేయడం సమజసం కాదన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మరిన్ని జీఎస్టీ సభలు పెట్టేందుకు ఏపీ ప్రభుత్వం జీవోలు విడుదల చేయడాన్ని తప్పుబట్టారు. జీఎస్టీ ఎక్కడ తగ్గిందో చూపించాలని నిలదీశారు. నిత్యావసర సరుకుల నుంచి రవాణా ఛార్జీల వరకు ఎక్కడా తగ్గినట్లు కనిపించలేదన్నారు. కేవలం ధనవంతులు ఉపయోగించే కార్ల రేట్లు మాత్రమే తగ్గాయన్నారు. సీఎం చంద్రబాబు పబ్లిసిటీ కోసం పాకులాడడం తప్ప సాధించిందేమీ లేదని దుయ్యబట్టారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణల ఫలితంగానే నేడు దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. తిరుపతి లోకసభ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 370 పరిశ్రమలు వచ్చాయని, అందులో శ్రీసిటిలోనే అత్యధికం ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శాంతియాదవ్, తేజోవతి, మునిశోభ, సమీఉల్లా, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం తిరుపతి రెడ్ శ్యాండిల్ కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ అధికారి శ్రీనివాసులు కథనం మేరకు.. కర్ణాటకలోని బంగారుపేట మండలం దొడ్డూరుకు చెందిన నారాయణప్ప శివకుమార్, సుబ్రహ్మణ్యం మంజునాథ 2019లో ఎర్రచందనం తరలిస్తుండగా ములకలచెరువు మండలం తంబళ్లపల్లె క్రాస్ వద్ద పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఆరేళ్లుగా విచారణ దశలో ఉన్న ఈ కేసును తిరుపతిలోని రాష్ట్ర స్థాయి ఎర్రచందనం కోర్టుకు బదిలీ చేశారు. ఇరువర్గాల వాదనలు విన్నాక న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జిల్లా సెషన్సు కోర్టు స్పెషల్ పీపీ అమరనారాయణ, లైజన్ అధికారి శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ గణేష్ సాక్ష్యాధారాలు హాజరు పరచడంలో సఫలీకృతులయ్యారు.



సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.66 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 61,521

తలనీలాలు సమర్పించినవారు : 25,101

అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో పటిష్ఠంగా ఏర్పాట్లు



అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుచానూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 17 నుంచి జరిగే తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు పటిష్ఠంగా ఏర్పాట్లు చేయాలని జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. అధికారులతో కలిసి శుక్రవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తుల రద్దీ నేపథ్యంలో ముందస్తుగా విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వాహనసేవలు పక్కాగా నిర్వహించాలన్నారు. టీటీడీ, పోలీసు సమన్వయం చేసుకుని భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అంతకు ముందు ఆలయంతో పాటు ఫ్రైడేగార్డెన్, తోలప్పగార్డెన్, జడ్పీ ఉన్నత పాఠశాల, పూడి రోడ్డు నుంచి నవజీవన్ ఆస్పత్రి వరకు పరిశీలించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఎస్ఈ వెంకటేశ్వర్లు, జగదీశ్వర్‌రెడ్డి, ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ నివాసులు, అర్చకుడు బాబుస్వామి, ఏవీఎస్వో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు డీపీఆర్‌లు సిద్ధం

● నగరాభివృద్ధికి రూ.30కోట్లు ● సీసీ రోడ్లు, డ్రైనేజీల ప్రారంభంలో ఎమ్మెల్యే, కమిషనర్



సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ కాలువలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి) : తిరుపతి ప్రజలకు అవసరమైన రోడ్లు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) సిద్ధం చేస్తున్నామని, ఇవికాకుండా 15వ ఫైనాన్స్ కమిషన్ నుంచి రూ.30కోట్లతో చేపట్టిన పనులు త్వరలోనే పూర్తి కానున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. 35వ డివిజన్ భవాని నగర్‌లో సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ కాలువలను శుక్రవారం ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణలతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేస్తున్నామని, ప్రభుత్వ నిధులు రాగానే ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, కూటమి నాయకులు నాగభూషణం, గేట్ వెంకటేశ్వర్లు, ఎస్వీఎం శ్రీధర్, సుబ్బు యాదవ్, వినోద్ రాయల్, రవితేజ నాయుడు, లక్ష్మి, మైనం సురేష్, చంద్రారెడ్డి, మణి నాయుడు, బాబ్జీ, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ గోమతి, డీఈ ప్రసాద్ పాల్గొన్నారు.



స్విమ్స్‌లో ఉచిత కంటి ఆపరేషన్లు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో వారం రోజులుగా 700 మందికి ఓపీ సేవలు, 70 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్విమ్స్ కంటి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాదుకు చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు వెంకటాచలం పర్యవేక్షణలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. శుక్రవారం నాటికి 700 మందికి ఉచిత కంటి ఓపీ సేవలను అందించడమేగాక 70 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్స చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కంటి విభాగాధిపతి ప్రభంజన్, ఎంఎస్ రామ్ పాల్గొన్నారు.

వర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ముసాయిదాను వెనక్కు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ముసాయిదాను వెనక్కు తీసుకోవాలని పీడీఎస్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ డిమాండ్ చేశారు. తిరుపతి యూత్ హాస్టల్‌లో శుక్రవారం జరిగిన పీడీఎస్‌వో తిరుపతి జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రతిపాదించిన లెర్నింగ్ ఔట్‌కమ్ బేస్డ్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ ముసాయిదా ఉన్నత విద్యారంగంలో తీవ్ర ఆందోళనకు దారితీస్తోందన్నారు. ఇది విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిపై నేరుగా దాడి చేసే చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా వైద్య విద్యను బలోపేతం చేయకుండా ప్రైవేటు భాగస్వామ్య విధానాన్ని ప్రోత్సహించడం విద్యా వ్యతిరేక చర్యగా పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ డి.గోవిందు మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉపాధి కరువై ఆత్మహత్యలు చేసుకుంటున్న ఈ తరుణంలో విద్య, ఉపాధి, వైద్యం అందరికీ హక్కుగా లభించేలా పోరాటం తప్ప మరో మార్గం కనిపించడం లేదని చెప్పారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు మోహన్‌దాస్ మాట్లాడారు. అంతకు ముందు ఎమ్మార్‌పల్లె సర్కిల్ నుంచి యూత్ హాస్టల్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తిరుపతి జిల్లా పీడీఎస్‌వో అధ్యక్షుడిగా వి.దేవేంద్రను, కార్యదర్శిగా ఆర్.ఆప్‌ను, సభ్యులుగా స్రవంతి, బాలాజీ, పవన్, ఇమ్మాన్యుయేల్, అజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

24న చెన్నై కార్గోలో నిల్వ పార్సిల్స్‌కు బహిరంగ వేలం

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చెన్నై కార్గో కేంద్రంలో నిల్వ ఉన్న వస్తువులకు ఈనెల 24న బహిరంగ వేలం వేయనున్నట్లు ఆర్టీసీ కమర్షియల్ ఏటీఎం నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది నవంబరు 30వ తేదీ వరకు వచ్చిన కొన్ని పార్సిల్స్‌ను ఎవరూ తీసుకెళ్లలేదని, స్థలాభావం కారణంగా వేలం వేయడానికి నిర్ణయించామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలను పరిష్కరించండి


కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. శుక్రవారం తిరుపతిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కోట మండలం వెంకన్నపాళెం గ్రామంలోని గర్భకండ్రిగ భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే నియోజకవర్గ పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని అభివృద్ధి పరిచేందుకు నిధులు కేటాయించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు కేటాయించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరామని తెలిపారు. అదేవిధంగా ఎస్పీ సుబ్బరాయుడిని కలిసి నియోజకవర్గంలో శాంతి రౌడీయిజం, దొంగతనాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సీడీపీవో మొహబూబి

గూడూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని సీడీపీవో మొహబూబి అన్నారు. శుక్రవారం స్థానిక శివాలయంలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే నిర్వహించారు. చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. డ్రాయింగ్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సుజనా, పద్మశ్రీ, రాజగోపాల్, లక్ష్మీప్రసన్న, సునంత, గీతాంజలి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న విభాగాధిపతులు

కోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. బెంగళూరుకు చెందిన ఎంకరోట సంస్థ బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఎలక్ట్రికల్ విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధి కౌసిక్, ప్రాంగణ ఎంపికల అధికారి కిషాంధర్ పాల్గొన్నారు.

అయ్యప్ప భిక్షను ప్రారంభించిన ఎమ్మెల్యే కురుగొండ్ల


అయ్యప్ప స్వాములకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబర్ 17(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప భక్త బృందం స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న కార్యాలయంలో గురువారం నిర్వహించిన అయ్యప్ప భిక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డించి ఎమ్మెల్యే వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వునుగోటి విశ్వనాథ నాయుడు, నాయకులు అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, గొల్లగుంట రాము, గొల్లగుంట వెంకటముని, అవ్వారు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని యువకుడి ఆత్మహత్య

తడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికి వెళ్లిపోయిందన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నైకు చెందిన కేశవన్ (36) శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతను మొదటి భార్యకు విడాకులు ఇచ్చి రెండవ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతుల మధ్య కొద్దిరోజుల కిందట గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన కేశవన్ తడలోని శ్రీకాళహస్తి రోడ్డులో నివాసం ఉంటున్న ఇంట్లో గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుతో గృహోపకరణాల దగ్ధం

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు చెంగాళమ్మ ఆలయ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున పిడుగుపడింది. దీంతో పలువురి ఇళ్లలో విద్యుత్ గృహోపకరణాలు కాలిపోయాయి.



చిలమనూరు భూమి ఆక్రమించి సాగుకు సిద్ధం చేసిన ఆక్రమణదారులు - ఆక్రమణలో కయ్యూరు చెరువు

ఆక్రమణలతో కుచించుకుపోతున్న చెరువులు

తగ్గిపోతున్న నీటి సామర్థ్యం ● పట్టించుకోని అధికారులు

బాలాయపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి మండలంలోని పలు చెరువులు ఆక్రమణలకు గురై కుచించుకుపోతున్నాయి. దీంతో చెరువుల్లో నీటి సామర్థ్యం తగ్గిపోయి పంటలకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువుల పటిష్టత కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా ఆక్రమణలతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. కయ్యూరు చెరువు విస్తీర్ణం 900 ఎకరాలు కాగా, ఇందులో దాదాపు 180 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని రైతులు పలుమార్లు నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ చెరువు కింద వెంకటగిరి మండలంలోని కుప్పంపల్లి, కందనాలపాడు, లక్ష్మీరాంపల్లి, బాలాయపల్లి మండలంలోని అరిగేపల్లి, కయ్యూరు, వేణుగోపాలపురం గ్రామాల పరిధిలో సుమారు సుమారు రెండు వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. చెరువు విస్తీర్ణం కుంచించుకుపోయి నీటి సామర్థ్యం తగ్గిపోయిందని రైతులు వాపోతున్నారు. అదేవిధంగా కాలగంద చెరువులో సుమారు 60 ఎకరాలకు పైగా ఆక్రమించి పంటలు సాగిస్తున్నారని గతంలో గ్రామస్థుల ఫిర్యాదుతో కేసు నమోదైంది. అలాగే చిలమనూరు చెరువు విస్తీర్ణం 312.48 ఎకరాలు కాగా, సుమారు 40ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా కడగుంట, మేల్చూరు చెరువుల్లోనూ ఆక్రమణదారులు పంటలు సాగు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువుల్లో ఆక్రమణలను తొలగించి నీటి సామర్థ్యం పెరిగేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



బాలాయపల్లి, మన్నూరులో ముళ్ల చెట్లతో నిండిన జగనన్న లే అవుట్లు

ఎవరి ఇంటి స్థలం ఎక్కడుందో!

● అడవులను తలపిస్తున్న జగనన్న లేఅవుట్లు
● ముళ్ల చెట్లతో నిండిపోయిన ఇళ్ల స్థలాలు

బాలాయపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలంలో జగనన్న లే అవుట్లు అడవులను తలపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం మండలంలోని 24 పంచాయతీల్లో 350 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. ఇందుకోసం 31 లేఅవుట్‌లను ఏర్పాటు చేశారు. మొదటి విడతగా 16 లేఅవుట్లలో 148 పక్కా గృహాలు నిర్మించేందుకు గృహనిర్మాణ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే లే అవుట్ల ఏర్పాటు పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు తూతూ మంత్రంగా మట్టితోలి చదును చేసి బిల్లులు తీసుకున్నారు. మౌలిక వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి మొగ్గు చూపలేదు. లే అవుట్లలో ముళ్ల చెట్లు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. తమకు కేటాయించిన స్థలం ఎక్కడుందో లబ్ధిదారులకు తెలీని పరిస్థితి నెలకొంది.

సీజేఐపై దాడి హేయమైన చర్య

గూడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి దేవదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిసింద్రీ, సాయినాథ్, కిరణ్‌కుమార్, నవీన్, సాయి, పెంచలయ్య, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలయపల్లి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం బాలాయపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి దేవదాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి మంగళపూరు సురేష్, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ సీపీఎం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహసీల్దార్ గోపినాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్కే రియాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు రవి, రఘు, సార్థకుమార్, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిచేసిన న్యాయవాదిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కంబేపల్లి నాగేశ్వరరావు, నాయకులు మల్లిరవి, సారం చెన్నమ్మ పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయండి

వెంకటగిరి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరావు, కల్పలత, డాక్టర్ మస్తాన్ యాదవ్, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీకి భూమి కేటాయించండి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఎంసీ చైర్మన్ రమేష్

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం ఏకొల్లులో ఉన్న 2.89 ఎకరాల భూమిని వ్యవసాయ మార్కెట్ కమిటీకి కేటాయించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ కోరారు. శుక్రవారం కలెక్టర్‌ను కలిసిన ఆకుతోట రమేష్ వినతిపత్రం అందజేశారు.

ఆర్థిక సాయం



నాయుడుపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలానికి చెందిన పుల్లా శ్రీకాంత్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అతని పరిస్థితి తెలుసుకున్న బలిజ సేవా ఫెడరేషన్ అధ్యక్షుడు పగడాల శివప్రదీప్, కార్యదర్శి హంసా పృథ్వీచంద్ శుక్రవారం రూ.13వేల సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు మోహన్, రాజాబాబు, సుబ్బారావు, సురేంద్ర, హరిబాబు, శివకిరణ్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్లో వసతులు కల్పించండి


హాస్టల్‌లో గదులను పరిశీలిస్తున్న ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్

కోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వసతిగృహంలో వసతులు కల్పించాలని విద్యార్థినులు కోరారు. కోట ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ తనిఖీ చేశారు. 2వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు ట్యాంకుల్లో నీరు చాలడం లేదని వార్డెన్ ఉషారాణి, విద్యార్థినులు ఎంపీడీవోకు తెలిపారు. వసతి గృహం ప్రాంగణంలో కొత్త వేస్తే తాగేందుకు, స్నానాలకు తగినంత నీరు ఉంటుందన్నారు. వసతి గృహంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో చెప్పారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ


విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎంఈవో, సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అట్టకానితిప్ప ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో దీపావళి పండుగ సంబరాలు నిర్వహించుకున్నారు. విద్యార్థులకు కొత్త దుస్తులు, టపాకాయలను ఎంఈవో సునీల, సీఐ మురళీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రేవతి, ఏఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కుయిల్, ఆచార్య భరద్వాస సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కోటలో కుండపోత వర్షం

కోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శుక్రవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ప్రధానంగా కోట, విద్యానగర్‌తో పాటు పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది.

వెంకటగిరిలో...

వెంకటగిరి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి కౌవల్యా నది ప్రవహిస్తోంది.

మానవత్వం చాటుకున్న డీఎస్పీ

వెంకటగిరి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద టీచర్స్ కాలనీకి చెందిన సాయిని ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో వెంకటగిరికి వస్తున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనంలోను క్షతగాత్రుడిని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. సాయి కాలు, చేతికి తీవ్రమైన గాయలు కావడంతో తిరుపతికి తీసుకెళ్లారు.


క్షతగాత్రుడికి సాయం చేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

విద్యార్థుల వసతులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గురుకులాలలో విద్యార్థులకు వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులతో పాటు భోజనాన్ని పరిశీలించారు. స్టోర్ రూంను సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యత విషయంలో నిర్లక్ష్యం చూపవద్దని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, గురుకులం ప్రిన్సిపాల్ సుబ్బారావు, సిబ్బంది ఉన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర కీలకం: ఎస్పీ

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర కీలకమని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ప్రజాకళావేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు సీనియర్ జర్నలిస్టులకు జరిగిన సత్కార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్పీ మాట్లాడారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారంలో మీడియా కృషి అభినందనీయమన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు సుదీక్ష గ్రూప్ కంపెనీల అధినేత డాక్టర్ గౌరవరం సుబ్రహ్మణ్యం శర్మ మాట్లాడుతూ జర్నలిస్టులకు తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ప్రజా కళావేదిక వ్యవస్థాపక చైర్మన్ అరవ జయపాల్ జర్నలిజం ప్రాముఖ్యతను వివరిస్తూ రాసిన చైతన్య గీతాన్ని కళాకారులు చలపతి, సుమతి, కృష్ణ కుమారి బృందం ఆలపించింది. తర్వాత పలువురు సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళావేదిక జాతీయ ఉపాధ్యక్షులు, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, విశ్రాంత లెక్చరల్ కృష్ణారెడ్డి, డాక్టర్ సి.నారాయణస్వామి, వివిధ ప్రతికల ఉపసంపాదకులు, వెటరన్ జర్నలిస్టులు పాల్గొన్నారు.